

	ఇఫ్తార్	సెహరి
	ఆదివారం	సోమవారం
కర్నూలు	6: 32	5:08
నంద్యాల	6: 29	5:08

యార్డులో మళ్లీ బయోగ్యాస్



మూలనకు చేరిన పని చేయని బయోగ్యాస్ ప్లాంటు

చెత్త నుంచి సంపదను సృష్టించే ఆధునిక విధానం ఇప్పుడు ముందుకు వచ్చింది. దీని వల్ల గ్రామాల్లో, పట్టణాల్లో చెత్త సమస్యకు పరిష్కారం దొరికింది. పైగా అదొక ఆదాయ వనరుగా మారింది. కర్నూలు మార్కెట్‌యార్డులో పేరుకపోయే చెత్త నుంచి బయోగ్యాస్ ఉత్పత్తి చేయడానికి గతంలో ఒక ప్లాంట్ ఏర్పాటు చేశారు. చెత్తను తొలగించడానికి వెచ్చించే లక్షలాది రూపాయలు ఖర్చు మిగలడమేగాక యార్డుకు వచ్చే రైతులకు తక్కువ ధరకు భోజనం పెట్టడానికి బయోగ్యాస్ దోహదం చేస్తోంది. వైసీపీ పాలనలో ఈ నిరుపయోగమైన ఈ ప్లాంట్‌ను తిరిగి కూటమి పాలనలో తిరిగి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు.

బయోగ్యాస్ ద్వారా జిల్లా మార్కెట్ యార్డుల్లో రైతులకు ఇక్కడ్నుంచే భోజనం

ఇస్కాన్ ధార్మిక సంస్థ ఇప్పటి వరకు కర్నూలు మార్కెట్ యార్డుతో పాటు ఆదోని, ఎమ్మిగనూరు యార్డుల్లో పంట ఉత్పత్తులను విక్రయించేందుకు వచ్చే 2000 మంది రైతులకు రూ. 10కే భోజనం పెడుతోంది. అయితే నిర్వహణ ఖర్చులు పెరిగి వారు ఇబ్బంది పడ్తున్నారు. ఈ పరిస్థితుల్లో బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు వారికి కొంత భారం తగ్గించిందని సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు. రైతు విశ్రాంతి భవన్ పక్కనే బయోగ్యాస్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు.



యార్డులో పేరుకుపోయిన చెత్తాచెదారం

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 8:కర్నూలు యార్డులోని కూరగాయల మార్కెట్‌లో వ్యాపారులు వృథాగా పడేసే కూరగాయలను బయటికి తరలించేందుకు నెలకు రూ.60 వేల దాకా ఖర్చు చేసేవారు. అయినా చెత్తను పూర్తిగా తొలగించకపోవడంతో పందులు, పశువులు అక్కడ తిరుగాడుతుండేవి. వాటి వల్ల రైతులు, వ్యాపారులు, వినియోగదారులు ఇబ్బందిపడేవారు. అప్పటి మార్కెటింగ్ శాఖ కమిషనర్ శ్యామూల్ ఆనంద్ కర్నూలు యార్డుకు వచ్చినప్పుడు ఈ పరిస్థితి గమనించారు. ఇలాంటి చెత్త నుంచి బయోగ్యాస్ ఉత్తత్తికి అవసరమైన యంత్ర పరికరాలు తయారు చేసే హైదరాబాద్‌లోని అయోజా కంపెనీ ప్రతినిధులను విజయవాడకు పిలిపించి మాట్లాడారు. వ్యర్థమైన కూరగాయలను ముడిసరుకుగా వినియోగించి బయోగ్యాస్ ఉత్పత్త చేసే ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్లాంట్ ఏర్పాటుకు రూ. 25 లక్షలను ఇస్కాన్ ధార్మిక సంస్థ, మార్కెట్ కమిటీ నిధులు ఖర్చు చేసి రాష్ట్రంలోనే మొట్టమొదటిసారి కర్నూలు యార్డులో బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఇస్కాన్ సంస్థ ప్రతినిధుల్ని అప్పట్లో ఛైర్మన్‌గా పని చేసిన పెరుగు పురుషోత్తంరెడ్డి, సెలక్షన్ సెక్రటరీ జయలక్ష్మి ఒప్పించారు.

రోజూ రెండు సిలిండర్ల గ్యాస్

బయోగ్యాస్ ప్లాంట్ వల్ల రోజూ రెండు సిలిండర్ల గ్యాస్‌ను ఉత్పత్తి చేయవచ్చు. ఈ గ్యాస్ వల్ల ఇస్కాన్ సంస్థకు ఖర్చు తగ్గనుంది. బయోగ్యాస్‌తో వండే ఆహార పదార్థాలు రుచికరంగా, ఆరోగ్యంగా ఉంటాయని ఇస్కాన్ ప్రతినిధులు చెబుతున్నారు.

బయోగ్యాస్ ప్లాంటు వల్ల మార్కెట్ యార్డులో కూరగాయల వ్యర్థాల సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికింది. అయితే.. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్లాంటు నిర్వహణను అటకెక్కింది. మళ్లీ కూటమి ప్రభుత్వం వచ్చాక, యార్డుకు సెక్రటరీగా వచ్చిన జయలక్ష్మి బయోగ్యాస్ ప్లాంటును అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. దీంతో రైతులు, వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చెత్త సమస్యకు పరిష్కారం దొరికింది:

రోజూ పేరుకు పోతున్న కూరగాయల చెత్తను తొలగించడం అధికారులకు తలనొప్పిగా మారింది. నెలకు రూ. 60 వేలు ఖర్చుచేసే పరిస్థితి తప్పిందని సెక్రటరీ తెలిపారు.

అప్పట్లోనే గ్యాస్ ప్లాంట్‌కు ట్రయల్ రన్

ప్రస్తుతం గ్యాస్ ప్లాంట్ ఏర్పాటైన తర్వాత ట్రయల్ రన్‌ను కూడా అప్పట్లోనే విజయవంతంగా నిర్వహించారు. అయోజ్ కంపెనీ ప్రతినిధులు ఈ ప్లాంట్‌ను ఎలా నిర్వహించాలో మార్కెట్ కమిటీ సిబ్బందికి తర్ఫీదు ఇచ్చారు.. ఈ ప్లాంట్‌లో రోజూ 500 కేజీల కూరగాయలను వినియోగించి రెండు సిలిండర్లకు సరిపడ గ్యాస్‌ను ఉత్పత్తి చేయవచ్చు. ప్రస్తుతం 100 కేజీల కూరగాయల్ని మాత్రం వినియోగిస్తున్నారు.

ఇక్కడ విజయవంతమైతే రాష్ట్రమంతటా..

ప్రస్తుతం బయోగ్యాస్ ప్లాంట్ కర్నూలు యార్డులో విజయవంతమైతే రాష్ట్రమంతా ఇలాగే ఏర్పాటు చేసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. కూరగాయల మార్కెట్లు మండల కేంద్రాలు, సబ్ డివిజన్ కేంద్రాలు, జిల్లా కేంద్రాల్లో నిర్వహణలో ఉన్నారు. నిరుపయోగంగా ఉండే కూరగాయల్ని వినియోగించి బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు.

- కూరగాయల చెత్తాచెదారానికి పరిష్కారం
- గత టీడీపీ హయాంలో మొదటిసారిగా కర్నూలు యార్డులో ..
- వైసీపీ పాలనలో మూలనపడ్డ ప్లాంటు
- కూటమి ప్రభుత్వంలో మళ్లీ అందుబాటులోకి తెచ్చే యత్నం

బయోగ్యాస్ ప్లాంటును అందుబాటులోకి తెస్తాం



గతంలో తాను సెక్రటరీగా ఉన్న సమయంలో ఈ బయోగ్యాస్ ప్లాంటు ఏర్పాటు చేశామన్నారు. నేను బదిలీపై వెళ్లిపోయాక ఇక్కడ దీన్ని సక్రమంగా నిర్వహించలేదు. ప్లాంటు మూత పడింది. ఇప్పుడు తిరిగి ప్లాంటును తెరిపించేందుకు ప్రయత్నిస్తున్నాం.

- జయలక్ష్మి
సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ

ఇంటర్ పరీక్షకు 601 మంది గైర్హాజరు

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి):ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పబ్లిక్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు మొత్తం 22,348 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారు. 21,738 మంది పరీక్షకు హాజరు కాగా, ఇందులో 601 మంది గైర్హాజరయ్యారు. ఎలాంటి మాల్ ప్రాక్టీసు కేసు నమోదు కాలేదు. ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి ఆధ్వర్యంలో డీవీఈవో పరమేశ్వరరెడ్డి, స్పెషల్ ఆఫీసర్ జి.లాలెప్ప, డీఈసీ కమిటీ సభ్యులు సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు.

మార్కెట్ సెస్సు వసూళ్లలో కర్నూలు టాప్

- లక్ష్యం రూ.7.60 కోట్లు ● ఇప్పటికే రూ.7.66 కోట్లు వసూలు

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో 15 మార్కెట్ సెస్సు వసూళ్లలో కర్నూలు మార్కెట్ కమిటీ ఆర్థిక సంవత్సరం గడవక ముందే లక్ష్యానికి మించి వసూలు చేయడంతో మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయ సునీత, జేడీ రామాంజనేయులు, మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మితో పాటు అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, శివన్న, నాగేష్ తదితర సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా శనివారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి మాట్లాడుతూ మార్చి ఆఖరు నాటికి కర్నూలు మార్కెట్ కమిటీ ద్వారా మార్కెటింగ్ శాఖకు రూ.7.60 కోట్ల సెస్సు వసూళ్లు చేయాలని కమిషనర్ లక్ష్యాన్ని నిర్దేశించారని అన్నారు. అయితే సగం నెల కూడా పూర్తి కాకముందే శనివారం నాటికి రూ.7.66 కోట్ల సెస్సు వసూళ్లయ్యాయని అన్నారు. ఈ సంవత్సరం పంట ఉత్పత్తులు అధికంగా రైతుల చేతికి అందడంతో పాటు అధికారులు, సిబ్బంది సమష్టిగా పని చేయడం వల్లనే లక్ష్యాన్ని అధిగమించగలిగామని అన్నారు. సెస్సు వసూళ్లు అధిగ మించినందుకు అసిస్టెంట్ సెక్రటరీ సూపర్‌వైజర్లు ఇతర సిబ్బందిని సెక్రటరీ జయలక్ష్మి అభినందించారు.

చంద్రప్రభ వాహనంపై అహోబిలేశుడు

ఎగువ, దిగువ అహోబిలంలో కొనసాగుతున్న ఉత్సవాలు



ఎగువ అహోబిలంలో చంద్రప్రభ వాహనంపై జ్వాలా నరసింహస్వామి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 8(ఆంధ్రజ్యోతి): అహోబిలం లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని జ్వాలా, ప్రహ్లాదవరదస్వామి దివ్యమంగళమూర్తులు భక్త నీరాజనాలు అందుకుంటున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఎగువ అహోబిలంలో శ్రీదేవీ, భూదేవి సమేత జ్వాలా నరసింహస్వామి ఉత్సవమూర్తులను పట్టుపీతాంబరాలు, పూలమాలలతో విశేషంగా అలంకరించి అర్చకులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారు ఉదయం శేష వాహనంపై కొలువై మాడవీధుల్లో విహరించారు. మధ్యాహ్నం స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకం, అర్చన నిర్వహించారు. తేజోమయుడైన జ్వాలా నారసింహుడు రాత్రి చంద్రప్రభ వాహనంలో విహరించారు. మైదుకూరు తహసీల్దార్ రాజసింహ నరేంద్ర దంపతులు ఉభయదారులుగా వ్యవహరించి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

దిగువలో యోగనృసింహ సేవ : దిగువ అహోబిలంలో ప్రహ్లాదవరద స్వామికి యోగ నృసింహ గరుడ విమాన సేవ నిర్వహించారు. ప్రహ్లాదవరదుడిని ఉభయదేవేరులతో యోగ నృసింహ అలంకరణలో కొలువుదీర్చారు. స్వామి, అమ్మవార్లను గరుడ విమానంపై కొలువుంచి ఆలయ మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. మధ్యాహ్నం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకం, విశేష పూజలు చేశారు. అనంతరం రాత్రి ప్రహ్లాద వరదస్వామి హనుమంత వాహనంపై ఆసీనుడై మాడవీధుల్లో శోభాయమానంగా విహరించారు. అహోబిల మఠం 46వ పీఠాధిపతి శ్రీవణ్ శఠగోప శ్రీ రంగనాథ యతీంద్ర మహాదేశికన్ పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యనారాయణన్ ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి.

మహిళల ముందడుగుతోనే దేశాభివృద్ధి

కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ది



మాట్లాడుతున్న జి. కబర్ది

కర్నూలు లీగల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో ముందడుగు వేస్తేనే దేశాభివృద్ధి సాధ్యమని కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ది తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో జరుగుతున్న అరాచకాలను దృష్టిలో ఉంచుకుని మహిళలు ఎల్లప్పుడూ జాగ్రత్తగా ఉండాలని కోరారు. మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకుంటే వారు తమ హక్కులనే కాకుండా సాటి మహిళల హక్కులను రక్షించడానికి తోడ్పడవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జీలు భూపాల్ రెడ్డి, లక్ష్మీరాజ్యం, సీనియర్ సివిల్ జడ్జీలు జ్యోత్స్నాదేవి, పి. లీలా వెంకటశేషాద్రి, మేజిస్ట్రేట్‌లు సరోజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతమైన జాతీయ లోక్ అదాలత్

స్థానిక న్యాయ సేవాసదన్ భవనంలో జరిగిన జాతీయ లోక్ అదాలత్ విజయవంతమైందని జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ది, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి. లీలా వెంకట శేషాద్రి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 22 బెంచీలను ఏర్పాటు చేసినట్లు, కర్నూలులో ఐదుగురు న్యాయాధికారులు ఈ లోక్‌అదాలత్‌ను నిర్వహించి పెద్ద సంఖ్యలో కేసులు పరిష్కరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జీలు జి. భూపాల్ రెడ్డి, లక్ష్మీరాజ్యం, లక్ష్మీనరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం



కర్నూలు రూరల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఈనెల 17 నుంచి 31వ తేది వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులకు జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పించినట్లు కర్నూలు ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ సుధా రాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఒరిజనల్ హాల్ టికె ట్లు కండక్టర్‌కు చూపించి బస్సులో ఉచిత ప్రయాణం చేయవచ్చునని, పరీ క్షల కోసం ఈ సౌకర్యం కల్పించా మ ని అ న్నారు. అన్ని రకాల బస్సుల్లో ఈ సౌకర్యం ఉంటుందని సీటీఎం తెలిపారు.

మహిళల పాత్ర విశిష్టం

- స్వయం, సహాయక సంఘాల మహిళలకు ఆసరా
- బాల్య వివాహాలను అరికట్టడానికి కృషి చేయాలి
- ఎంపీ నాగరాజు, కలెక్టర్ రంజిత్ బాషా





కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కర్నూలు కలెక్టరేట్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కుటుంబంలో, సమాజంలో మహిళల పాత్ర విశిష్టమైనదని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, కలెక్టర్ పి. రంజిత్ బాషా అన్నారు. శనివారం నగరంలోని ఎంఆర్సీ కన్వెన్షన్ హాలులో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ మహిళలు సాధించిన విజయాల వల్లనే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్నారని అన్నారు. మహిళలు లింగ వివక్ష, ఓటు హక్కు, చదువుకునే అవకాశం లేని పరిస్థితులను అధిగమించి ఈ స్థానానికి ఎదగడానికి ప్రపంచవ్యాప్తంగా మహిళలు చేసిన పోరాటాలే కారణమని అన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల్లో భాగంగా సెర్ప్ నుంచి బ్యాంకు లింకేజీ ద్వారా రూ.100 కోట్లు, మెప్మా నుంచి రూ.34 కోట్లు మహిళలకు అందుతున్నాయని అన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా శుక్రవారం ఎంఎస్ఎంఈ ప్రోగ్రాం కింద రూ.55 కోట్లు రుణాలు అందించామని అన్నారు. ఎంఎస్ఎంఈల కింద మహిళలకు దాదాపు రూ.13.27 కోట్లు రుణాలు, ర్యాపిడో ప్రోగ్రాం కింద ఎలెక్ట్రిక్ స్కూటీలను 25 మంది సభ్యులకు ఇచ్చామన్నారు. జేసీ డా.బి. నవ్య మాట్లాడుతూ 1917లో రష్యన్ విప్లవం సందర్భంగా మహిళలు సాధించిన విజయాలను పురస్కరించుకొని 1922లో మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా ప్రకటించారని అన్నారు. వాల్మీకి కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఛైర్మన్ బొజ్జమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల అభివృద్ధికి తగిన ప్రోత్సాహం ఇస్తుందన్నారు. వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ విజయమ్మ, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, డీఆర్వో పీడీ వెంకట నారాయణమ్మ, ఐసీడీఎస్ పీడీ నిర్మల, మెప్మా, పీడీ శివనాగలీల, డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి అరుణ మహిళల పోరాటాల గురించి మాటాడారు. కర్నూలు మున్సి పల్ కమిషనర్ రవీంద్రబాబు, డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి దీప్తి, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి జయమ్మ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తులసిదేవి, మైనార్టీ కార్పొరేషన్ అధికారి సబీహా పర్వానా, రెసిడెన్షియల్ పాఠశాలల జిల్లా కోఆర్డినేటర్ శ్రీదేవి, కర్నూలు అర్బన్ తహసీల్దార్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.



పాల్గొన్న ఉద్యోగులు

శ్రీగిరిలో వైభవంగా స్వర్ణ రథోత్సవం



స్వర్ణరథంపై స్వామి అమ్మవార్లు

శ్రీశైలం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో శనివారం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్ల స్వర్ణ రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వేకువజామున మల్లికార్జున స్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేష పూజలను అర్చకులు నిర్వహించారు. అనంతరం ఉదయం 7.30 గంటలకు స్వర్ణరథాన్ని నేత్రశోభితంగా పుష్పాలతో అలంకరించారు. ఆలయ ఈవో ఎం. శ్రీనివాసరావు స్వర్ణరథానికి కొబ్బరికాయలు, గుమ్మడికాయలు సమర్పించి రథోత్సవాన్ని ప్రారంభించారు. స్వామి, అమ్మవార్లు ఆసీనులైన స్వర్ణరథం ఆలయ మాడవీధుల్లో అశేష భక్తజనం నడుమ వైభవంగా జరిగింది. స్వర్ణరథం ఎదుట కోలాటం, చెక్కభజన, జానపద కళాకారులు భక్తులను ఆకట్టుకుంది. భద్రతా ఏర్పాట్లను సీఐ ప్రసాదరావు, దేవస్థానం చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ కె. అయ్యన్న పర్యవేక్షించారు.



నృత్యం చేస్తున్న కళాకారులు

S ఆదివారం ప్రత్యేకం
u.n.d.a.y.s.p.e.c.i.a.l

హంగులతో రూపుదిద్దుకున్న టీజీవీ కళాక్షేత్రం



కందనవోలు నందుల నిలయం..!

కర్నూలు కల్చరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో 1970లో అప్పటి ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ కేవీ చలపతిరావు, డిప్యూటీ కలెక్టర్ కె.వెంకటరెడ్డి, ఉపాధ్యాయుడు సయ్యద్ అహ్మద్‌లు 'లలిత కళాసమితి' పేరుతో సంస్థను నెలకొల్పారు. సి.క్యాంపులోని 24 సెంట్ల స్థలాన్ని సేకరించారు. వీరి కృషి ఫలితంగా 1998లో మొట్టమొదట జరిగిన నంది నాటక పోటీల్లో ఐదు నందులతోపాటు జ్యూరీ అవార్డును 'నరనారాయణ' అనే నాటకం అందుకుంది. దీనికి సింహం లక్ష్మీనారాయణ దర్శకుడు. ఆయన దర్శకత్వంలో ఎన్నో పద్యనా టకాలు ప్రదర్శించారు. వ్యవస్థాపకుల్లో ఒకరైన సయ్యద్ అహ్మద్ సాంఘిక నాటకాలకు దర్శకత్వం వహిస్తూ ఎన్నో బహుమతులు సాధించారు. ఆ రోజుల్లో జంపాల శివయ్య అధ్యక్ష బాధ్యతలు స్వీకరించాక సమితి రూపురేఖలు మార్చేశారు. తర్వాత ఈ పరంపరను అధ్యక్షులుగా థామస్‌రెడ్డి, దస్తగిరి కొనసాగించారు. అప్పట్లో లలిత కళాసమితి ఓపెన్ ఎయిర్ థియేటర్‌గా ఉండేది.

జీవం పోసిన టీజీ వెంకటేశ్



రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ కళాక్షేత్రానికి జీవం పోశారు. 2006లో ఆయన ప్రకటించిన భారీ విరాళంతో ఆరుబయలు కళామందిరం దశదిశ మారింది. అలాగే రూపురేఖలు మార్చుకొని 'టీజీవీ కళాక్షేత్రం'గా రూపాంతరం చెందింది. 2009లో ఆడిటోరియం లాంఛనంగా ప్రారంభమైంది. తర్వాత ఏసీ ఏర్పాటుతోపాటూ ప్రేక్షకులు హాయిగా కూర్చొని తిలకించే కుషన్ సీట్లు, లిఫ్ట్ ఏర్పాటు, అగ్నిమాపక సౌకర్యం కల్పించారు. టీజీవీ కళాక్షేత్రం ప్రాంగణంలో రెండంతస్తుల భవన నిర్మాణానికి టీజీ వెంకటేశ్ తిరిగి రూ.3 కోట్లు విరాళం అందజేశారు. ఫలితంగా నవ్యాంధ్ర రాష్ట్రంలోనే అన్ని హంగులు ఉన్న కళామందిరంగా రూపొందింది. దాదాపు మూడున్నర కోట్ల విరాళం అందజేసిన టీజీ వెంకటేశ్ పేరుపైన టీజీవీ కళాక్షేత్రంగా ఆనాటి శాశ్వత సభ్యుల సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. 2009 నుంచి టీజీవీ కళాక్షేత్రం నవ్యశోభితంగా ఆవిష్కృతమైంది.

కాలి అందియల సవ్వడులు మదిని పరవశింపజేసినా... వేలి కదలికలతో మోగిన వీణాతంత్రులు శ్రవణానంద భరితమైనా.. ఆ ప్రత్యేకత ఆ కళాక్షేత్రానికే దక్కుతుంది. ముఖానికి రంగులు వేసుకొని, నట సింగాలైన నవోన్మేష కళాకారులకు, నవరసాలను హృద్యంగా ఒలికిస్తూ నాటకానికి ప్రాణం పోసిన నట కిరీటులకు ఆది నిలయం అది. అంతే కాదు...నాటి రాయలవారి భువన విజయాన్ని మరపించేలా అనునిత్యం సాహితీ సభలతో పరిఢవిల్లుతూ, అనేకానేక పుస్తకాల ఆవిష్కరణలతో, గొప్ప గొప్ప సాహిత్య వైతాళికులను కందనవోలుకు అందిస్తోంది. నటన, నాట్యం, సంగీతం, సాహిత్యం వంటి నాలుగు అంశాలను నేల నాలుగు చెరగులా చాటిచెబుతూ కందనవోలు కళామతల్లి నుదిట మణిహారంగా విరాజిల్లుతోంది. తన పదిహేనేళ్ల అప్రతిహత ప్రస్థానంలో ఒకటి కాదు, రెండు కాదు, ఏకంగా 38 రాష్ట్ర ప్రభుత్వ నంది అవార్డులు సాధించి, రాష్ట్రంలోనే ఏకైక కళాసంస్థగా విరాజిల్లుతోంది. అందే కర్నూలులోని టీజీవీ కళాక్షేత్రం. ఏ ఆడిటోరియంలోనైనా అద్దెతోపాటు విద్యుత్తు, ఇతరత్రా సదుపాయాలకు సొమ్ము చెల్లించాలి. కానీ ఈ క్షేత్రంలో కళకు డబ్బు, భాష, ప్రాంతం, కొలమానం అంటూ ఏవీ లేవనే రీతిలో ఉచితంగా కళాకారులకు, కళాప్రదర్శనలకు అవకాశం కల్పిస్తోంది. పేద కళాకారులకు, దూరప్రాంతాల నుంచి వచ్చే కళాకారులకు తగురీతిలో ఆర్థిక సహకారాలు కూడా అందిస్తూ కళలను ప్రోత్సహిస్తూ కళల కాణాచిగా నిలుస్తోంది. వేలాది మంది ఔత్సాహిక కళాకారుల నిలయంగా టీజీవీ కళాక్షేత్రం అందిస్తున్న విభిన్న కార్యక్రమాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

- రాష్ట్రంలోనే 38 నంది పురస్కారాలు పొందిన ఏకైన సంస్థ
- అనునిత్యం సాహితీ, కళా ప్రదర్శనలు
- కళామతల్లి నుదుట మణిహారంగా టీజీవీ కళాక్షేత్రం
- ప్రోత్సాహకాలతో కళాకారులకు భరోసా

నాటక చరిత్రలో ఎన్నో మైలు రాళ్లు

టీజీవీ కళాక్షేత్రం పక్షాన కళాకారులు తమదైన ప్రతిభను దేశవ్యాప్తంగా చాటిచెబుతున్నారు. కళాక్షేత్రం నాటక రంగ చరిత్రలో 'పులిస్వారీ' నాటకం ప్రత్యేకంగా నిలిచిపోతుంది. సుమారు 200 ప్రదర్శనలు రాష్ట్రవ్యాప్తంగా ఆడిన ఈ నాటకం నాటి రాయలసీమలోని ముఠాకక్షల నిర్మూలనకు ఎంతో దోహదం చేసింది. ఈ నాటకం జిల్లాలోని ఫ్యాక్షన్ ప్రాంతాల్లోనూ ప్రభావితం చూపించింది. ఫ్యాక్షన్ నేపథ్యం ఉన్న గ్రామాల్లోకి వెళ్లాలంటే భయపడే రోజుల్లో కళాక్షేత్రం కళాకారులు వెళ్లి ధైర్యంగా ప్రదర్శనలు ఇచ్చారు. కప్పట్రాళ్ల, బనగానపల్లె, ఆళ్లగడ్డ, నందికొట్కూరు వంటి ఫ్యాక్షన్ ప్రాంతాల్లో నాటకాలను ప్రదర్శించారు. అలాగే రెండు నంది బహుమతులు, అనేక పరిషత్తుల్లో ఉత్తమ ప్రథమ బహుమతులను అందుకుంది.



నాటి ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి నుంచి 'తానా' పురస్కారం అందుకుంటున్న పత్తి ఓబులయ్య

నంది అవార్డుల పంట

రాష్ట్ర ప్రభుత్వం సినిమా, టీవీ, నాటక రంగ అభివృద్ధి సంస్థ ద్వారా ఏటా నిర్వహించే నంది నాటక పోటీలకు టీజీవీ కళాక్షేత్రం కళాకారులు పోటీ పడుతున్నారు. 1998లో నాటి ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు ప్రవేశ పెట్టిన నాటక రంగ నంది పురస్కారాల్లో మొట్టమొదటి ఏడాది 1998లో నరనారాయణ నాటకానికి 5 నందులు, 1999లో పులిస్వారీకి 2, మబ్బుల్లో బొమ్మకు 1, 2000లో కృష్ణాభిమాన్యుకు ఒకటి, 2004లో భక్తమాధవదాసుకు ఒకటి, 2007లో శ్రీకృష్ణాభిమన్యుకు 2, 2009లో మహారథి కర్ణకు ఒకటి, 2011లో ఓమనిషీ నీకు జోహార్లుకు 2, 2012లో బభ్రువాహన విజయంకు ఒక బంగారు, 3 వెండినందులు, 2014లో శ్రీకృష్ణాభిమన్యుకు 3 నందులు, 2015లో కర్ణార్జునీయంకు 4 నందులు, 2016లో ప్రమీలార్జున పరిణయంకు ఏకంగా 7 నందులు లభించాయి. 2017లో సైసై నరసింహారెడ్డికి 3, 2023లో శ్రీకృష్ణకమలపాలిక పద్యనాటకానికి రెండు నందులు వచ్చాయి. ఇవే కాక, తిరుపతి, ఒంగోలులో జరిగే జాతీయ నాటక పోటీల్లోనూ ప్రథమ బహుమతులు గెల్చుకున్న ఘనత టీజీవీ కళాకారులకు దక్కుతుంది.



ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి నంది పురస్కారం అందుకుంటున్న నాటక దర్శకుడు పత్తి ఓబులయ్య

ప్రతిరోజూ సాహితీ, సాంస్కృతిక సేవలో

టీజీవీ కళాక్షేత్రంలో ఏడాదిలో ప్రతిరోజూ సాహితీ, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతూనే ఉంటాయి. ప్రతి 'ఆదివారం సాంస్కృతిక కార్యక్రమం', ప్రతి నెలా చివరి ఆదివారం 'నాటకం', అలాగే సాంఘిక నాటిక, కళాప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. అలాగే బాలల కోసం ప్రత్యేకంగా 'టీజీవీ అకాడమీ' పేరుతో చిన్నారులకు నృత్య శిక్షణలు వారంలో రెండు రోజులు ఏర్పాటు చేశారు. అలాగే వేసవిలో బాలల కోసం ప్రత్యేకంగా నృత్య, నటన, చిత్రలేఖన, వక్తృత్వ శిక్షణలు ఇస్తూ వారిని కళారంగం పట్ల ప్రోత్సాహం కల్పిస్తున్నారు.

సాహిత్యానికి సముచిత స్థానం

టీజీవీ కళాక్షేత్రంలో కళాప్రదర్శనలతోపాటు నిత్యం సాహిత్య కార్యక్రమాలు విరాజిల్లుతున్నాయి. ఈ క్షేత్రంలో ప్రత్యేకంగా సాహితీవేదికను ఏర్పాటు చేశారు. అనేక పుస్తకావిష్కరణలు, సాహిత్య సభలు, సమావేశాలు నిర్వహిస్తూ సాహిత్యక్షేత్రాన్ని సుసంపన్నం చేస్తున్నారు. గతంలో గరికపాటి నరసింహారావు ఉపన్యాసం చేశారు. అలాగే శివారెడ్డి, ఆచార్య కొలుకలూరి ఇనాక్, సినీ గీత రచయిత గోరటి వెంకన్న వంటి అనేక మంది సాహితీ ప్రముఖులు ఇక్కడి కార్యక్రమాలకు హాజరయ్యారు. తెలుగు సాహిత్యంలో ప్రముఖంగా నిలిచే శతావధానం వంటి కార్యక్రమాలు సాహితీప్రియులను అలరింపజేస్తున్నాయి.

ఆదాయ పన్ను మినహాయింపు

టీజీవీ కళాక్షేత్రం నేడు 12ఏ మినహాయింపు క్షేత్రంగా సేవలు అందిస్తోంది. కళలు, సాహిత్య రంగాలకు అందిస్తున్న సేవలకు గాను ఆదాయ పన్ను శాఖ 12ఏ సౌకర్యం కల్పించడంతోపాటూ, ఈ కళాక్షేత్రం పురోభివృద్ధికి, కార్యక్రమాల నిర్వహణకు డొనేషన్ల రూపంలో దాతలు సొమ్ము అందజేస్తే వారికి 80జీ (పన్ను మినహాయింపు) సౌలభ్యం కల్పిస్తోంది. కళాక్షేత్రానికి ఇచ్చే విరాళాలను తమ ఆదాయ పన్నులో మినహాయింపు పొందే అవకాశం నాటి టీజీవీ కళాక్షేత్రం చైర్మన్, ప్రస్తుత రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ కల్పించారు.



పత్తి ఓబులయ్యకు అక్కినేని, సి.నారాయణ రెడ్డిలతో సత్కారం



టీజీవీ కళాక్షేత్రం లోని వేదిక

మూడుసార్లు సీఎం చంద్రబాబుతో పురస్కారాలు



రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మూడుసార్లు మూడు నంది అవార్డులు తీసుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. కళామతల్లికి సేవలు అందించడమే లక్ష్యంగా టీజీవీ కళాక్షేత్రం ముందుకు పోతోంది. టీజీవీ కళాక్షేత్రం ప్రస్తుత చైర్మన్, రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేశ్ సహకారం ఎన్నటికీ మరువలేనిది. ఆయన ఆర్థికంగానే కాకుండా, హార్దికంగా ఇచ్చిన చేయూత నేడు నగరంలో టీజీవీ కళాక్షేత్రం ఒక స్థానం సంపాదించుకుంది. కళామతల్లికి సేవ చేయాలనే ఆయన ప్రోత్సాహమే మమ్మల్ని నడిపిస్తోంది. టీజీవీ కళాక్షేత్రం ప్రదర్శించే పద్య నాటకాలకు నేను దర్శకత్వం వహిస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రదర్శనలు ఇస్తున్నాం. అలాగే అనేక పురస్కారాలు సాధిస్తున్నాం. మేమే కాకుండా ఎవరు సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాలు నిర్వహించినా, కళాక్షేత్రం అన్ని సౌకర్యాలతో పాటూ ఉచిత విద్యుత్తును కూడా కల్పిస్తూ వారికి అవకాశం ఇస్తోంది. స్థానిక కళాకారులకు ప్రోత్సాహంతోపాటూ, ఇతర ప్రాంతలకు చెందిన కళాకారులకు కూడా చేయూత ఇచ్చే విధంగా కార్యక్రమాలు నెలపొడవునా నిర్వహిస్తున్నాం.

- పత్తి ఓబులయ్య, అధ్యక్షుడు, టీవీజీ కళాక్షేత్రం

మల్లన్న సేవలో ప్రముఖులు



శ్రీశైలంలో మంత్రి రవికుమార్, ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

శ్రీశైలం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల భ్రమరాంబ, మల్లికార్జున స్వామి వార్లను శనివారం రాత్రి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, గిద్దలూరు ఎమ్మెల్యే ఎం.అశోక్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ప్రముఖులకు రాజగోపురం వద్ద దేవస్థానం ఈవో ఎం.శ్రీనివాసరావు, వేదపండితులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రముఖులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రతేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వేదపండితులు, అర్చకులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈవో శేషవస్త్రాలతో వారిని సత్కరించి స్వామి, అమ్మవార్ల చిత్రపటాలను, ప్రసాదాన్ని అందించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

కర్నూలు అర్బన్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి పిలుపునిచ్చారు. కర్నూలు నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. 'కుడా' చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు ముంతాజ్, కార్పొరేటర్ కైపా పద్మలతారెడ్డి, కేవీ సుబ్బారెడ్డి విద్యాసంస్థల అధినేత కేవీ సుబ్బారెడ్డితో కలిసి కేక్ కట్ చేసి మహిళలు, నాయకులు, కార్యకర్తలు మధ్య కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు, సీఎం చంద్రబాబు నాయుడు నిత్యం మహిళా సంక్షేమానికి చరిత్రలో నిలిచిపోయే పథకాలు తీసుకొచ్చారని అన్నారు. కేవీ సుబ్బారెడ్డి సహకారంతో ముగ్గురు మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు, పార్టీ గుర్తుగా సైకిల్‌ను ఓ యువకుడికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు హనుమంతరావు చౌదరి, చంద్రకాంత్, సత్రం రామకృష్ణుడు, షేక్షావలి, మల్లేశ్వరి, రాణి, జానకమ్మ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ ఎం. హరికిషన్‌కు జాతీయ పురస్కారం



హరికిషన్‌ను సత్కరిస్తున్న సాహితీవేత్తలు

కర్నూలు కల్చరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన ప్రముఖ బాలల సాహితీవేత్త, కథా రచయిత డాక్టర్ ఎం. హరికిషన్ శనివారం కడప జిల్లా ప్రొద్దుటూరులో 'కొనిరెడ్డి ఫౌండేషన్' జాతీయ పురస్కారం అందుకున్నారు. ప్రొద్దుటూరులోని ఎస్కే గ్రాండ్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ అవార్డును కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డీకే చదువుల బాబు, ప్రముఖ సామాజిక సేవకుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి తదితరుల చేతుల మీదుగా అందుకున్నారు. జాతీయ పురస్కార గ్రహీతను నిర్వాహకులు శాలువ, పూలదండలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఎం. హరికిషన్ రాసిన 'చిలక ముక్కు చిన్నోడు' కథల పుస్తకానికి జాతీయ పురస్కారం లభించింది.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

మిడుతూరు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మిడుతూరు మండల పరిధిలోని తలముడిపి గ్రామ పొలిమేరలో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. భిక్షాటన చేసుకొని జీవిస్తున్న వృద్ధుడు తలముడిపి బాటకు, మంచాలకట్ట గ్రామం మధ్యలో రోడ్డు పక్కన పొలాల కాలువలో పడి మృతి చెందాడు. మృతుని శవం వద్ద భిక్షాటన చేసుకున్న చిల్లర పైసలు, పళ్లెం, పాత బట్టలు ఉన్నాయి. ఎస్ఐ ఓబులేసు తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని వృద్ధుడి మృతదేహాన్ని పరిశీలించారు.

బైకు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

కర్నూలు క్రైం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ఉలిందకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో చిన్నటేకూరు సమీపంలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎల్ల మద్దయ్య (55) అనే వ్యక్తి దుర్మరణం చెందాడు. కొడుకు ఎల్లస్వామితో కలిసి మద్దయ్య బైక్‌పై వెళ్తుండగా.. ఈ ప్రమాదం జరిగింది. వెల్దుర్తికి చెందిన ఎల్ల మద్దయ్య స్థానిక ఆలయంలో పూజారిగా పని చేస్తున్నాడు. కొడుకుతో కలిసి కర్నూలు వచ్చి తిరిగి వెల్దుర్తికి వెళుతుండగా మార్గమధ్యంలో చిన్నటేకూరు వద్ద వీరు ప్రయాణిస్తున్న బైక్ ఫ్లైఓవర్ వద్ద రైలింగ్‌ను ఢీకొట్టింది. బైక్ మీద వెనుక కూచున్న ఎల్లమద్దయ్య కింద పడటంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఉలిందకొండ ఎస్ఐ ధనుంజయ తెలిపారు.

ఇద్దరికి గాయాలు

బండిఆత్మకూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏ కోడూరు గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు తీవ్ర గాయాలపాలయ్యారు. తెలిపిన శనివారం ఉదయం 9 గంటల ప్రాంతంలో ఏ కోడూరుకు చెందిన శ్రీనివాసులు మోటర్ బైక్‌పై పొలం దగ్గరికి వెళ్తూ మలుపు తిప్పుతుండగా.. వెనుక నుంచి మోటార్ బైక్‌పై వచ్చిన చంద్రశేఖర్ ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో శ్రీనివాసులు, నంద్యాలకు వెళ్తున్న కాకనూరుకు చెందిన చంద్రశేఖర్ రక్త గాయాలపాలయ్యాయి. ఇరువురిని స్థానికులు 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చంద్రశేఖర్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. చంద్రశేఖర్ తండ్రి 8 నెలల క్రితమే పాముకాటుతో మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు బండిఆత్మకూరు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు.

వంట మాస్టర్ ఆత్మహత్య

నంద్యాల క్రైం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మండలం కానాల గ్రామానికి చెందిన వంటమాస్టర్ సురేష్ (43) శనివారం ఆత్మహత్యకు పాల్పడినట్లు నంద్యాల తాలుకా పోలీసులు తెలిపారు. సురేష్ భార్య 2023లో మరణించిందని, ఆ బాధ తట్టుకోలేక అప్పటినుంచి సురేష్ మద్యానికి బానిసైనట్లు చెప్పారు. శనివారం ఇంటిముందు రసాయన ద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తాలుకా పోలీసులు తెలిపారు.

బైకు కొనివ్వలేదని యువకుడు..

పగిడ్యాల, మార్చి 8(ఆంధ్రజ్యోతి): బైకు కొనివ్వలేదని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పగిడ్యాల మండలంలోని కె.ముచ్చుమర్రిలో జరిగింది. ముచ్చుమర్రి ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి తెలిపిన వివరాలివీ.. కొత్త ముచ్చుమర్రికి చెందిన బోయ వెంకటేశ్వర్లు కుమారుడు శివరాం (21) పదో తరగతి వరకు చదువుకొని డ్రైవర్ పని చేస్తున్నాడు. తనకు బైకు కొనివ్వాలని యువకుడు కొన్ని రోజులుగా తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకు వస్తున్నాడు. ఈ విషయంపై శుక్రవారం రాత్రి తండ్రీకొడుకుల మధ్య వాగ్వాదం జరిగింది. శివరాం శుక్రవారం అర్ధరాత్రి ఇంట్లో ఉరి వేసుకున్నాడు. యువకుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భార్య పుట్టింటికి వెళ్లిపోయిందని..

రుద్రవరం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : భార్య లక్ష్మీదేవి పుట్టింటికి వెళ్లిందని భర్త ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన రుద్రవరం మండలం ఎర్రగుడిదిన్నె గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. ఎర్రగుడిదిన్నె గ్రామానికి చెందిన చంద్రశేఖర్ (30) మద్యానికి బానిస కావడంతో ఆయన భార్య లక్ష్మీదేవి ఇద్దరు కుమార్తెలు, ఒక కొడుకుతో కడప జిల్లా ముద్దనూరు మండలం కోసినేనిపల్లె గ్రామం పుట్టింటికి వెళ్లింది. దీనిని జీర్ణించుకోలేక భర్త తన ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ వర ప్రసాద్ తెలిపారు.

హత్య కేసులో వ్యక్తి అరెస్టు

కొలిమిగుండ్ల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెలుం శింగవరం గ్రామంలో ఈనెల 6న బిజ్జం మనోహ రమ్మ(37) అనే మహిళను హత్య చేసిన ఘటనలో మృతురాలి భర్త బిజ్జం చిన్న వెంకటరామిరెడ్డిని శనివారం అరెస్ట్ చేసినట్లు కొలిమిగుండ్ల సీఐ రమేశ్‌బాబు వెల్లడించారు. ఈమేరకు నిందితుడ్ని మీడియా ముందు ప్రవేశపెట్టారు. నిందితుడు మద్యానికి బానిసగా మారి, చెడు అలవాట్లతో భార్యను వేధించేవాడని, ఈ క్రమంలో గురువారం మనోహరమ్మ డబ్బు ఇవ్వలేదన్న కారణంతో రోకలి బండతో దాడి చేశాడని సీఐ తెలిపారు. బనగానపల్లె ఆసుపత్రిలో ఆమె మృతి చెందిందన్నారు. నిందితుడిని శనివారం అంకిరెడ్డిపల్లె సమీపంలో అరెస్ట్ చేసి కోవెలకుంట్ల మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా, రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

మహిళా సాధికారతకు కృషి: మంత్రి బీసీ



బనగానపల్లె, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మహిళా సాధికారత కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం బనగానపల్లె పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి బీసీ మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు హయంలోనే డ్వాక్రా మహిళా సంఘాలను ఏర్పాటు చేసి వారి జీవనోపాధుల అభివృద్ధుల కోసం కృషి చేసినట్లు తెలిపారు. మహిళల సాధికారత కోసం సీఎం చంద్రబాబునాయుడు శ్రమిస్తున్నారన్నారు.

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కృషి: మంత్రి



మహిళలను సన్మానిస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ మహిళలను గౌరవించే పార్టీ టీడీపీయేనన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ఉన్నత శిఖరాలు అధిరోహించేలా పార్టీ తోడ్పాటు అందిస్తుందన్నారు. అనంతరం మహిళా నాయకులను శాలువాలతో సన్మానించారు.

10న రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు

ఓర్వకల్లు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్.కొంతలపాడు గ్రామంలో వెలసిన అంబాసహిత యాగంటీశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా రైతు సంఘం ఆధ్వర్యంలో ఈనెల 10న రాష్ట్ర స్థాయి పాలపండ్ల బండల లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు చంద్రశేఖరప్ప శనివారం తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే ఎద్దుల యజమానులు రూ.500లు ప్రవేశ రుసుం చెల్లించి రషీదు పొందాలన్నారు. గెలుపొందే యజమానులకు మొదటి నుంచి ఐదు బహుమతులు వరుసగా రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.15 వేలు నగదును అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వివరాల కోసం 9701338439, 9963628175లను సంప్రదించాలన్నారు.

సెలవు రోజుల్లోనూ పన్నులు చెల్లించవచ్చు

కర్నూలు న్యూసిటీ, మార్చి 8(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరపాలక సంస్థకు చెల్లించవలసిన పన్నులు సెలవు రోజుల్లో కూడా చెల్లించవచ్చని, శని, ఆదివారాల్లోనూ నగరపాలక సంస్థలో పన్ను వసూలు కేంద్రాలు తెరచే ఉంటాయని నగరపాలక సంస్థ మేనేజర్ ఎన్ చిన్న రాముడు శనివారం తెలిపారు. ఈనెల 31 వరకు పన్నులు చెల్లించాల్సి ఉన్నందున ఆరోజు వరకు రెండో శనివారం, ఆదివారంతో పాటూ ప్రతి రోజూ సాయంత్రం అదనంగా ఒక గంట (సాయంత్రం 6 గంటల వరకు) పన్ను వసూలు కేంద్రాలు తెరచే ఉంటాయని తెలిపారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విజయవాడకు రైళ్లను పునరుద్ధరించాలి


కర్నూలు రైల్వేస్టేషన్ ముందు ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

కర్నూలు రూరల్, మార్చి8 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నుంచి విజయవాడకు వెళ్లే రైళ్లను పునరుద్ధరించాలని ఏఐటీయూసీ, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శులు మునెప్ప, శ్రీనివాసులు, షాబీర్‌భాష, డీహెచ్‌పీఎస్ నగర కార్యదర్శి కుమార్‌రాజ ప్రభుత్వాన్ని కేంద్ర రైల్వేశాఖను డిమాండ్ చేశారు. శనివారం ఆ యూనియన్ ఆధ్వర్యంలో సంయుక్తంగా వారు కర్నూలు రైల్వేస్టేషన్ ముఖద్వారం ఎదుట ఏఐటీయూసీ నగర కార్యదర్శి చంద్రశేఖర్ అధ్యక్షతన ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ పాత రాజధాని కర్నూలు నుంచి కొత్త రాజధాని విజయవాడకు గతంలో మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రైలు ఉండేదని కోరోనా సమయంలో అనేక రైళ్లను రద్దు చేయడం జరిగిందన్నారు. అమరావతితో పాటు హైకోర్టుకు వెళ్లాలన్న కర్నూలు నగర, జిల్లా ప్రజలు తప్పనిసరిగా డోన్, నంద్యాలకు వెళ్లి జనరల్ బోగిలో ప్రయాణం చేసే పరిస్థితి నెలకొందన్నారు. విజయవాడకు వెళ్లే ప్రతి రైలుకు అదనంగా జనరల్ బోగీలను కేటాయించాలని డిమాండ్ చేశారు. తక్షణమే కర్నూలు ఎంపీ స్పందించి కర్నూలు నుంచి నేరుగా విజయవాడకు ప్రత్యేక రైలును నడిపించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సోమన్న, శరత్‌కుమార్, చింటు, నాగరాజు, అఖిల్, రంగన్న పాల్గొన్నారు.

యాగంటీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

ఓర్వకల్లు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్.కొంతలపాడు గ్రామంలో వెలసిన అంబాసహిత యాగంటీశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం యాగంటీశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈవో చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో యాగంటీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఫెస్టివల్ కమిటి సభ్యులు శ్రీనివాసులు, చంద్రసేనారెడ్డి, పుల్లయ్య, పురుషోత్తం, సువర్ణ, రంగమ్మ, వెంకటరమణమ్మ, వరలక్ష్మీ, నాగలక్ష్మి పాల్గొన్నారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు

ఓర్వకల్లు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్.కొంతలపాడు గ్రామంలో వెలసిన అంబాసహిత యాగంటీశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా అంతరాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను శనివారం ఫెస్టివల్ కమిటి సభ్యులు శ్రీనివాసులు ప్రారంభించారు. ఇతర జిల్లాల నుంచి 15 టీములు పాల్గొన్నాయి. ఈ పోటీలు హోరాహోరీగా జరిగాయి. గెలుపొందిన విజేతలకు మొదటి నుంచి ఆరు బహుమతులు వరుసగా రూ.25 వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.6వేలు, రూ.5వేలు నగదును అందజేస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో చంద్రశేఖర్ రెడ్డి, విజయ్, నరేష్, రాముడు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సింధూర రెడ్డికి వాల్మీకుల ధన్యవాదాలు

కర్నూలు కలెక్టరేట్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): శాసనసభలో వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరణ కోసం గలమెత్తిన పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డికి వాల్మీకి బోయ సేవ సంస్థ గౌరవాధ్యక్షులు కుబేరస్వామి టీడీపీ పార్లమెంటు జిల్లా ఉపాధ్యక్షులు బేతం కృష్ణుడు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం త్వరగా వాల్మీకి బోయల ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షులు పెద్దయ్య, కార్యదర్శి మల్లికార్జున, కోశాదికారి శేఖర్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా నగరంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కర్నూలు టౌన్ ఈఈ టి.శేషాద్రి శనివారం తెలిపారు. ఆదివారం ఉదయం 7 నుంచి మాధ్యాహ్నం 10 గంటల వరకు నగరంలో కరెంట్ కోత ఉంటుందన్నారు. స్టాంటన్‌పురం, సుంకేసులారోడ్, ఎస్‌బీఐకాలనీ, అశోక్‌నగర్, పెద్దమార్కెట్ ఏరియా, ఖండేరి, ఖడక్‌పుర, కొండారెడ్డి ఏరియా, కొత్తపేట , కల్లూరు ప్రాంతాల్లోని ప్రజలు గుర్తించి విద్యుత్ అధికారులు, సిబ్బందికి సహకరించాలని కోరారు.

విధుల బహిష్కరణకు ఆరోగ్య మిత్రల పిలుపు

కర్నూలు హాస్పిటల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): డా.ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద పని చేస్తున్న ఉద్యోగులు నిరసన పట్టనున్నారు. ప్రభుత్వం ఎన్టీఆర్ వైద్యసేవ పథకాన్ని బీమా పరిధిలోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నించడం, ఆబ్కాస్ రద్దు నిర్ణయాలకు వ్యతిరేకంగా దశలవారిగా నిరసన బాట పట్టనున్నట్లు ఏపీ వైద్య సేవ ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు సి.కంబగిరి, ఉపాధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి తెలిపారు. గత 17 సంవత్సరాలు చాలీచాలని వేతనాలతో జీవనం సాగిస్తున్నామన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా ఉద్యోగుల జీవితాలు మాత్రం మారడం లేదన్నారు. ఉద్యోగుల ప్రధానసమస్యల పరిష్కారం కోసం 10, 17, 24 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా వైద్యసేవల విధులు బహిష్కరిస్తామని వారు తెలిపా రు.

కూటమి ప్రభుత్వంపై వైసీపీ పోరాటం

కర్నూలు న్యూసిటీ, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చని కూటమి ప్రభుత్వంపై వైసీపీ పోరాటానికి సిద్ధమవుతుందని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి అన్నారు. శనివారం నగరంలోని ఎస్వీ కాంప్లెక్స్ సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఏ సమస్యపై కూడా స్పందించడం లేదన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలపై డిప్యూటీ సీఎం సమాధానం ఇవ్వాలన్నారు. కూటమి ప్రభుత్వంలో అన్ని శాఖల మంత్రులు ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఆలూరులు తాగునీరు లేక వలసలు వెళ్తున్నారని, అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలు, ఉ ద్యోగ కల్పనపై కూటమి ప్రభుత్వం రాష్ట్ర గవర్నర్‌తో అబద్ధాలు చెప్పించిదన్నారు.

చలివేంద్రాలు ప్రారంభం

కర్నూలు హాస్పిటల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల, స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్‌లో శ్రీ సద్గురు దత్త కృపాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నాలుగు చలివేంద్రాలను శనివారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శ్రీసద్గురు దత్త కృపాలయం గత 23 సంవత్సరాల నుంచి రోగులకు ఎన్నో సేవలందిస్తుందని, అందులో భాగంగా ప్రతిరోజు వేయి మంది రోగుల సహాయకులకు మధ్యాహ్నం భోజనం అందిస్తుందన్నారు. అలాగే ఆసుపత్రికి కావాల్సిన పరికరాలను కూడా అందించిందని, ఎండాకాలంలో రోగులు, వారి సహాయకుల కోసం దాహార్తిని తీర్చేందుకు ఈ ఏడాది కూడా నాలుగు చలివేంద్రాలను ప్రారంభించడం అభినందనీయమన్నారు. కర్నూలు జీజీహెచ్‌లో ట్రామ కేర్, గైనిక్, సూపర్ స్పెషాలిటీ బ్లాక్, స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్‌లో చలివేంద్రాలను ఏర్పాటు చేశామని, రోగులు, వారి సహాయకులు వీటని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డా.శివబాల నాగాంజన్, శ్రీసద్గురు దత్త కృపాలయం వ్యవస్థాపకులు చంద్రశేఖర్ రెడ్డి ప్రెసిడెంటు మల్లారెడ్డి పాల్గొన్నారు.


కర్నూలులో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు


డా.జిక్కిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, వైద్యులు


గూడూరులో పారిశుధ్య కార్మికులకు చీరల పంపిణీ

సమాజంలో మహిళల పాత్ర కీలకం

మహిళా దినోత్సవంలో ప్రముఖులు

కర్నూలు న్యూసిటీ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని, మహిళలు లేనిదే సమాజం లేదని మాత సత్సంగ్ వ్యవస్థాపకురాలు శ్రీదేవి అన్నారు. శనివారం జడ్పీ మినీ సమావేశభవనంలో ఏవో కే.సరస్వతి, కే.పుష్పలత అధ్యక్షతన మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ప్రభుత్వ వైద్యురాలు డా.అరుణ, న్యాయవాది ఆళ్లగడ్డ నాగవిజయ, విశ్రాంత ఎంపీడీవో గౌరీదేవి, జడ్పీ సీఈవో సతీమణి శేషకుమారి, సీఈవో జి.నాసరరెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. డీపీఆర్‌సీ కో ఆర్డినేటర్ మంజులావాణి, తిరుమలేశ్వరరెడ్డి, మహిళా ఉద్యోగులు మాధవి, గాయత్రిదేవి, సమీరియా, సైరాబాను, జి.మాధవి, కౌసల్య, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

● బిర్లా కాంపౌండ్ శశికాంత్ ప్లాజాతో బీసీ రిజర్వేషన్ పోరాట సమితి కార్యాలయంలో జాతీయ ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మి కాంతయ్య, నాయకురాలు చంద్రకళ భాయ్ ఆధ్వర్యంలో ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఉపాధ్యాయురాలు నిర్మల, సుబ్బమ్మలను సన్మానించారు. ఈకార్యక్రమంలో గోవిందప్ప, వీరభద్ర, ఆశోక్ పాల్గొన్నారు.

కర్నూలు అర్బన్: జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అమ్మ వృద్ధుల శరణాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ మహిళా అధ్యక్షురాలు ఏ. వెంకట సుజాత అధ్వర్యంలో కేక్ కట్ చేసి వృద్ధులకు పంచి పెట్టారు.

● ప్రభుత్వ బీఈడీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దుర్గాబాయ్ దేశ్ ముఖ్, సరోజినీ నాయుడు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

కర్నూలు న్యూసిటీ: చట్టసభల్లో రిజర్వేషన్ భిక్షకాదని, అది మన హక్కు అని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవాని అన్నారు. శనివారం సీఆర్ భవన్‌లో మహిలా సమా ఖ్య, సమతా మహిళా విభాగం, జనవిజ్ఞాన వేదిక జిల్లా సమితి అధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రావణిరెడ్డి, నగర కార్యదర్శి యు.భారతి, సీనియర్ నాయకులు కే.జగన్నాథం, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.

గూడూరు: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కౌన్సిలర్ రత్నమ్మ, కో ఆప్షన్ సభ్యుడు పి. రామాంజనేయులు అన్నారు. శనివారం గూడూరులోని ఏడో వార్డు సింగనగేరిలో అంతర్జాతీయ మహిళా దినోత్స వం సందర్భంగా కౌన్సిలర్ రత్నమ్మ, కో ఆప్షన్ సభ్యు డు పి. రామాంజనేయులు నగర పంచాయతీ పారిశుధ్య కార్మికులకు చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పరశురాముడు, బాబు, కృష్ణ, రాముడు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సి. బెళగల్: మండలంలోని గుండ్రేవుల, పోలకల్లు, సంగాల, కంబంధహల్, బురాన్‌దొడ్డి, బ్రాహ్మణదొడ్డి గ్రామాల్లో జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం ఘనంగా జరుపుకున్నారు. మహిళలకు ఆటలు పోటీలను నిర్వహించారు. ఆటల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. అనంతరం గ్రామములోని ఎంపీటీసీ నూర్జహాన్, గ్రామ సర్పంచ్ రెడ్డిగారి మాదేవిని పూలమాలు శాలువలుతో సన్మానించారు. ఈకార్యక్రమంలో గుండ్రేవుల గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్యామల, ఆయా గ్రామాల్లోని సర్పంచులు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

కర్నూలు ఎడ్యుకేషన్: స్థానిక బీ.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో శనివారం కళాశాల ప్రిన్సిపాల్ డా.నాగస్వామి నాయక్ అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

● స్థానిక ఏ.క్యాంపు షైఫర్ ఫార్మశీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పరిపాలనా అధికారి సిందూ సుబ్రహ్మణ్యం, కళాశాల అకడమిక్ డైరెక్టర్ డా.స్టెల్లా సతీష్, అధ్యాపకులు, ప్రిన్సిపాల్ డా.కే.మహాలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ డా.కాసర్ల సురేష్, అకడమిక్ డీన్ డా.రాజ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● స్థానిక కేవీ సుబ్బారెడ్డి ఇంజనీరింగ్, ఫార్మశీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు కళాశాల కరస్పాండెంట్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ కమిషన్ ప్రతినిధి మారుతీశర్మ, అడ్వకేట్ విజయలక్ష్మి, బీజేపీ మోర్చా అధ్యక్షురాలు గీతామాధురి, ఫ్యాకల్టీ తదితరులు పాల్గొన్నారు.

● స్థానిక రవీంద్ర మహిళా ఇంజనీరింగ్ కళాశాల, జి.పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాల, రవీంద్ర డిగ్రీ కళాశాల, పాఠశాలల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.సరళాదేవి హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో రవీంద్ర విద్యాసంస్థల వ్యవస్థాపకులు జి.పుల్లయ్య, సీఈవో డా.జి.మమతా మోహన్, ప్రిన్సిపాల్స్ కేశ శ్రీనివాసమూర్తి, ఉషారాణి, పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

కర్నూలు హాస్పిటల్: ప్రతి మహిల తమ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని డీఎంహెచ్‌వో డా.పి.శాంతికళ సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని నగరంలోని జోహరాపురంలో ఉన్న కిమ్స్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఎంహెచ్‌వో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 35 ఏళ్లు దాటిన ప్రతి మహిళ తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. గైనకాలజీ హెచ్‌వోడీ డా.లక్ష్మిప్రసన్న మాట్లాడుతూ పురుషులతో పోలీస్తే మహిళలో ఆరోగ్యసమస్యలు ఎక్కువగా వస్తుంటాయని హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకోవడం వల్ల సర్వేకల్ క్యాన్సర్‌ను అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో కిమ్స్ హాస్పిటల్ సీవోవో సునీల్ సేపూరి, చిన్న పిల్లల వైద్య నిపుణులు డా.జి.సుధాకర్, వైద్యులు డా.అరుణ, డా.శిల్ప, డా.కుసుమ, డా.సుష్మ పాల్గొన్నారు.

● మహిళలు వైద్య రంగంలో సేవలు అందించడం మరువలేమని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కే.చిట్టినరసమ్మ అన్నారు. శనివారం కేఎంసీ కౌన్సిల్ హాల్‌లో మహిళా ప్రొఫెసర్లు, హెచ్‌వోడీలను సన్మానించారు. మొదటి సీనియర్ నెఫ్రాలజీ ప్రొఫెసర్ డా.పీఎస్ జిక్కి, ప్రొఫెసర్లు డా.రాధారాణి, డా.లక్ష్మిబాయి, డా.అమీరున్నీ భేగం, డా.విశాల, డా.మంజులబాయి, డా.మాధవీ శ్యామలను సన్మానించారు.

కర్నూలు హాస్పిటల్: జి.పుల్లారెడ్డి డెంటల్ కాలేజీ అండ్ హాస్పిటల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డా.బి.శంకర్‌శర్మ పాల్గొని మహిళ పోరాటాలు, సాధికారిత గురించి వివరించారు. కార్యక్రమంలో డెంటల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.మురళిధర్ రెడ్డి, డా.భారతి, డా.నేహా, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

● జీజీహెచ్‌లో ఏపీ గవర్నమెంటు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు, డిప్యూటీ కలెక్టర్ సింధు సుబ్రహ్మణ్యం, నర్సింగ్ సూపరింటెండెంట్ ఎస్‌పీ సావిత్రీబాయి పాల్గొన్నారు. క్రీడల్లో గెలుపొందిన హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులకు సింధు సుబ్రహ్మణ్యం బహుమతులను అందజేశారు. అనంతరం రిటైర్డు నర్సింగ్ సూపరింటెండెంట్ గంగ రత్నమ్మను నర్సెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శి ఎం.లీలావతి, సి.బంగారి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జి.శాంతి భవాని, జిల్లా కోశాధికారి ఎన్.లక్ష్మీనరసమ్మ ఘనంగా సన్మానించారు. ఈసీ సభ్యులు శాంతిలత, సోమేశ్వరి, ఉషారాణి పాల్గొన్నారు.

కల్లూరు: మహిళల ఆర్థిక పరిపుష్టికి సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని కర్నూలు మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి అన్నారు. శనివారం పాణ్యం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురష్కరించుకుని కేక్‌కట్ చేశారు. తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌యాదవ్‌తో కలిసి ఆయన పారిశుధ్య కార్మికులకు సన్మానించారు. కార్యక్రమంలో యశ్వంత్‌రెడ్డి, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, పల్లె రఘునాథ్‌రెడ్డి రాష్ట్ర లీగల్‌సెల్ కార్యదర్శి నాగముని పాల్గొన్నారు.

కర్నూలు రూరల్: రాష్ట్రంలో మహిళల అభ్యున్నతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పేర్కొన్నారు.శనివారం అంతర్జాతీయ మహిళల దినోత్సవం కర్నూలు మండలం పసుపుల పంచాయతీ కార్యలయంలో మహిళ సిబ్బంది నిర్వహించిన అంతర్జాతీయ మహిళ దినోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా మహిళల సమక్షంలో కేక్‌కట్ చేసి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హేమంత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓర్వకల్లు: టీడీపీ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెద్దపీట వేశారనీ టీటీడీ బోర్డు సభ్యులు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఓర్వకల్లులోని పొదుపు లక్ష్మి ఐక్య సంఘం కార్యాలయంలో మండల సమైఖ్య గౌరవ సలహాదారాలు విజయభారతి ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా మల్లెల రాజశేకర్ హాజరై కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఓర్వకల్లు పొదుపు మహిళలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొంది ఇతర రాష్ట్రాల్లో అక్కడ మహిళలకు పొదుపుపై శిక్షణ ఇవ్వడం గర్వించదగ్గ విషయమన్నారు.

కర్నూలు స్పోర్ట్స్: మహిళా ఒలంపియన్లను స్ఫూర్తిగా తీసుకుని రాణించాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి భూపతిరావు మహిళలకు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక బీ.క్యాంపు క్రీడా మైదానంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం అగ్రికల్చర్ కలాశాల ప్రిన్సిపాల్ మణిదీప్ జట్టుకు కప్పుతో పాటు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.


ఓర్వకల్లులో కేక్ కట్ చేస్తున్న మల్లెల రాజశేఖర్


కేక్ కట్ చేస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి



మాట్లాడుతున్న డాక్టర్ శంకర్‌శర్మ

కర్నూలు కల్చరల్: నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను కన్నుల పండువగా నిర్వహించారు. నగర బలిజ సంఘం ఆధ్వర్యంలో, రాయల్ మహిళా సంఘం నిర్వహణలో ఈ వేడుకల్లో వందలాది మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, బలిజ సంఘం గౌరవాధ్యక్షుడు సింగంశెట్టి సోమశేఖర్, నగర బలిజ సంఘం అధ్యక్షుడు గాండ్ల లక్ష్మన్న, ప్రధాన కార్యదర్శి మండ్లెం రవి, ఉపాధ్యక్షుడు ఈశ్వర్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు.

కర్నూలు అగ్రికల్చర్: మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో రాణిస్తున్నారని, జనాభాలో కూడా పురుషుల కంటే అధిక సంఖ్యలో ఉన్నందున మహిళా సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కర్నూలు మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి డిమాండ్ చేశారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కర్నూలు మార్కెట్ కమిటీ కార్యాలయ ప్రాంగణంలో యార్డులో పని చేస్తున్న మహిళా కార్మికులకు ఆటల పోటీలను నిర్వహించారు.

కర్నూలు క్రైం: మహిళలు, బాలికల భద్రతే ధ్యేయమని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కర్నూలు జిల్లా పోలీస్ కార్యాలయంలోని పరేడ్ మైదానంలో అమీలియో హాస్పిటల్, కర్నూలు ఓమెగా హాస్పిటల్స్ ఆధ్వర్యంలో పోలీసు కుటుంబాల మహిళల కోసం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఎస్పీతో పాటు ఏపీఎస్‌పీ రెండో బెటాలియన్ కమాండెంట్ దీపికా పాటిల్‌తో పాటు కలిసి ప్రారంభించారు. అనంతరం వైద్యులను శాలువాలతో సన్మానించి మెమెంటోలను అందజేశారు. ఏఎస్పీ అడ్మిన్ హుసేన్‌పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, అమీలియో ఆసుపత్రి వైద్యులు లక్ష్మీప్రసాద్, శృతి, రేవతి, విజయలక్ష్మి, విష్ణుచంద్రిక, మునీరాబేగం, పవన్‌తేజ, ఓమేగా ఆసుపత్రి వైద్యులు ఆదిత్య శిల్ప, మార్కెటింగ్ టీం షేక్షావలి, రంజిత్ కుమార్, పోలీసు వెల్ఫేర్ యూనిట్ హాస్పిటల్ డా.ఆర్.స్రవంతి, డీఎస్పీలు శ్రీనివాసాచారి, బాబు ప్రసాద్, ట్రైనీ డీఎస్పీ ఉషశ్రీ, బాషా, భాస్కర్‌రావు, ప్రసాద్, సీఐలు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, మహిళా పోలీసులు, మహిళా హోంగార్డులు తదితరులు పాల్గొన్నారు.


కర్నూలులో మెమెంటో అందజేస్తున్న పోలీసు అధికారులు


కల్లూరు: పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్ యాదవ్


మార్కెట్‌యార్డులో విజేతలకు బహుమతులు పంపిణీ చేస్తున్న సెక్రటరీ జయలక్ష్మి


ప్రతిభ కనబరిచిన విద్యార్థిని నీలం అమృతను సన్మానిస్తున్న కరస్పాండెంట్ విజయలక్ష్మమ్మ


టీజీవీ కళాక్షేత్రంలో మహిళా దినోత్సవాన్ని ప్రారంభిస్తున్న పత్తి ఓబులయ్య, గాండ్ల లక్ష్మన్న

అన్న క్యాంటిన్ల నిర్వహణ అద్భుతం: కమిషనర్

కర్నూలు న్యూసిటీ, మార్చి 8(ఆంధ్రజ్యోతి): నగరంలో అన్న క్యాంటిన్ల నిర్వహణ అద్భుతంగా ఉందని, దానికి ప్రజల ఫీడ్ బ్యాకే నిదర్శనమని నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అన్నారు. శనివారం ఆయన పాతబస్టాండు, కలెక్టరేట్, ప్రభుత్వ ఆసుపత్రిల్లోని అన్నక్యాంటిన్లను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. టిఫిన్ చేస్తున్న ప్రజలన ఆత్మీయంగా పలకరించి, ఆహర పదార్థాల రుచి, శుభ్రత, నిర్వహణలపై ఆరా తీశారు. అక్కడే ఉన్న మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మెనూలో ఉన్న ఆహర పదార్థాలను, స్వచ్ఛమైన తాగునీరును ప్రజలకు అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఐదు నెలల క్రితం క్యాంటిన్లు ప్రారంభించగా ఇప్పటి వరకు 7,20,652 మంది భోజనం చేశారని కమిషనర్ తెలిపారు.

సర్వే పకడ్బందీగా చేపట్టాలి

కర్నూలు న్యూసిటీ, మార్చి 8(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, కార్యదర్శులు సర్వేను పకడ్బందీగా చేపట్టాలని కర్నూలు డివిజనల్ పంచాయతీ అధికారి లక్ష్మీ అన్నారు. ఏపీ పంచయతీరాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం జడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో స్వామిత్య రీసర్వే ప్రాజెక్టులో భాగంగా ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు సర్వే శాఖ అధికారులు స్వామిత్య రీ సర్వేపై పలు అంశాలను ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, కార్యదర్శుకు వివరించారు. డీఎల్‌పీఓ మాట్లాడుతూ సంబంధిత ప్రక్రియ ఎంపిక చేయబడిన గ్రామాల సచివాలయ ఉద్యోగులు గ్రామ సర్వేయర్‌తో కలిసి చేయాలన్నారు. డివిజన్‌లో పైలెట్ ప్రాజెక్టు కింద ఏడు మండలాలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్‌డీఓలు, పంచాయతీ కార్యదర్శులు, డీఎల్‌పీఓ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు ప్రాథమిక విద్యే గట్టి పునాది

- డీఈవో శ్యామ్యూల్ పాల్


మాట్లాడుతున్న డీఈవో శ్యామ్యూల్ పాల్

కర్నూలు కల్చరల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు భవిషత్తులో గొప్పగా ఎదగడానికి ప్రాథమిక విద్యే గట్టి పునాది అని డీఈవో శ్యామ్యూల్ పాల్ అన్నారు. నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో శనివారం స్థానిక గణేశ్ నగర్‌లోగల హారిజాన్స్ ఇంటర్నేషనల్ ప్లే స్కూల్ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్యామ్యూల్ పాల్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల ప్రాథమిక విద్యకు ప్రాధాన్యత ఇచ్చి, వారిని అందులో రాణించేలా చేయడమే పిల్లలకు ఇచ్చే ఒక గొప్ప బహుమతి అని చెప్పారు. కార్యక్రమంలో మరో అతిథి రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి. పుల్లయ్య, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ప్రదీప్‌కుమార్, అకడమిక్ డైరెక్టర్ పి. పావని, టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పుష్పయాగం

● గోదా గోకుల క్షేత్రంలో ముగిసిన బ్రహ్మోత్సవాలు


గోదా గోకుల క్షేత్రంలో పుష్పయాగం కార్యక్రమంలో మహిళా భక్తులు

కర్నూలు కల్చరల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): గత వారం రోజులుగా నగర శివారు మామిదాలపాడులోని గోదా రంగనాథ స్వామి దేవస్థానంలో కొనసాగుతున్న ఆలయ ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు చివరి రోజు శనివారం విశేష పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. సుమారు వెయ్యి కిలోలకు పైగా వివిధ రకాల పుష్పాలతో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాల ముందు ప్రత్యేకంగా అలంకరించారు. త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో, ఆలయ వేద పండితులు రమేష్ భట్టార్, కిరణ్ భట్టార్, లక్ష్మీనారాయణాచారుయలు, మహేషాచార్యులు శాస్త్రోక్తంగా స్వామి, అమ్మవార్లను పుష్పపత్రాలతో అర్చించారు. ఈ కార్యక్రమాల్లో గోదా గోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజగుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, బ్రహ్మోత్సవ నిర్వహణ కార్యవర్గ సభ్యులు ఇటిక్యాల పుల్లయ్య, వేముల జనార్థన్, లింగం క్రిష్ణయ్య శెట్టి, వేముల రవిప్రకాశ్, తల్లం సురేష్ బాబు, వేముల శివనాగప్రసాద్, భీమిశెట్టి ప్రకాశ్, చిగిలి రమేష్, కేవీఎన్ కృష్ణ, పాలాది సుబ్రహ్మణ్యం, భీమిశెట్టి నాగరాజు, మాకం శ్రీనివాస్, కలికి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


పుష్పోత్సవంలో స్వామి, అమ్మవార్లు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


ఆదోని అమరావతి పాఠశాలలో డీఎస్పీ హేమలతకు సన్మానం


ఆలూరు: పరీక్ష అట్టలు పంపిణీ చేస్తున్న వైకుంఠం శివప్రసాద్


ఆలూరు: మహిళలను సన్మానిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్

- ఆదోని డీఎస్పీ మర్రిపాటి హేమలత
- ఆదోని, ఆలూరులో పత్తికొండ నియోజకవర్గాల్లో మహిళా దినోత్సవం

ఆదోని అగ్రికల్చర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాలలో రాణించాలని డీఎస్పీ మర్రిపాటి హేమలత సూచించారు. శనివారం అమరావతి పాఠశాలలో వేడుకలకు డీఎస్పీ హేమలత, టీడీపీ నాయకురాలు గుడిసె కృష్ణమ్మ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కరెస్పాండెంట్ గుడిసె రామకృష్ణ, రాజేశ్వరి పాల్గొన్నారు.

వాల్మీకి ఉద్యోగుల ఆధ్వర్యంలో

వాల్మీకి ఉద్యోగుల సంఘం అధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు సుశీల, స్కూల్ అసిస్టెంట్ భవాని, ఉపాధ్యాయురాలు అనురాధ, కళ్యాణి దేవిలను ఘనంగా సన్మానించారు. జిల్లా నాయకుడు బాల వెంకటేష్ మాట్లాడుతూ మహిళలు ఉద్యమ శక్తిగా ఎదగాలని పిలుపునిచ్చారు. నాయకులు ముక్కరన్న, నీలకంఠ నాయుడు, లక్ష్మీనారాయణ, నరసయ్య, లక్ష్మీకాంత్, సత్తన్న, రమేష్ నాయుడు, సుధాకర్ బాబు, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

తుగ్గలి: మండలంలోని తుగ్గలి, జొన్నగిరి, రాంపల్లిలో మహిళా దినోత్సవం సందర్భంగా వారిని సన్మానించారు. టీడీపీ మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు మాట్లాడుతూ మహిళల అభివృద్ధితో కుటుంబం చెందుతుదన్నారు. సర్పంచ్ మనేంద్ర, ఆర్డీటీ సంస్థ ప్రతినిధులు సీఆర్పీ నగేష్ తదితరులు ఉన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

పత్తికొండ టౌన్: పట్టణంలో కేపీఆర్ ట్రస్టు వ్యవస్థాపకులు రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ, సర్పంచ్ కొమ్ముదీపిక, ఆసుపత్రి సూపరింటెండెంట్ కల్పన, కార్యదర్శి కాలేబొ కారియా, వాసవి మండలి అధ్యక్షురాలు మమతను సన్మానించారు.

ఆలూరు: విద్యతోనే బాలికల అభివృద్ధి సాధ్యమని టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్ అన్నారు. శనివారం కేజీబీవీ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు అట్టలు, పెన్నులు పంపిణీ చేశారు. ఎస్‌వో సుహాసిని, టీడీపీ నాయకులు కృష్ణ యాదవ్, రెహ్మాన్, విశ్వతేజ పాల్గొన్నారు.


దేవనకొండ: వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్నఆకె రవికృష్ణ

- టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ పార్టీ కార్యాలయంలో మహిళలను సన్మానించారు. బ్రాంచ్ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షులు నగరడోణ కిష్టప్ప, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రాంనాథ్ యాదవ్, టీడీపీ మండల కన్వీనర్ అశోక్, నాయకులు గరి మల్లేష్, కొమ్ము రాజు, కిట్టు, రత్నమ్మ, నాగమణి పాల్గొన్నారు.

ఆదోని రూరల్: చంద్రబాబుతోనే మహిళాభివృద్ధి సాధ్యమని తెలుగు మహిళా కార్యదర్శి సాధికాబేగం, జిల్లా ఉపాధ్యక్షురాలు రాజేశ్వరి, శ్రీదేవి అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేశారు. సీఎం చంద్రబాబు మహిళల రక్షణ, అభివృద్ధిపై పరితపిస్తారన్నారు.

అలూరు రూరల్: మహిళలను అన్ని రంగాల్లో గుర్తిస్తేనే సమాజం అభివృద్ధి చెందుతుందని ఎంఈవో-2 చిరంజీవి తెలిపారు. శనివారం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో యుటీఎఫ్, ఎస్టీయూ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో సమతా సంచికను ఆవిష్కరించారు. సుజాతమ్మ, జయమ్మ, నిర్మల రాణి, రామలింగమ్మ, అత్సరబాష, హేమలత యూటీఎఫ్ నాయకులు ఖాసీం, రూపాలత, సురేష్ బాబు, బి రామాంజినేయులు, రంగస్వామి, పాల్గొన్నారు.

ఆదోని టౌన్: మహిళల అభివృద్దితోనే దేశాభివృద్ధి సాధ్యమని రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి అన్నారు. స్వకుల సాళే అంకిని,


ఆదోని రూరల్: కేక్ కట్ చేస్తున్నమహిళలు

దశాంకిని కో- ఆపరేటివ్ సొసైటీ, వరల్డ్ సాళే ఫౌండేషన్ సంయుక్తంగా శనివారం రాత్రి మహిళా దినోత్సవం నిర్వహించారు. మునిసిపల్ చైర్‌పర్సన్ వాల్మీకి శాంత, ఎంపీఐ శిశిర దీప్తి మాట్లాడుతూ, మహిళలు రాజకీయాలలో కూడా ప్రత్యేకత చాటుకొంటున్నారన్నారు. రసాలే అంబిక, మైత్రియి నాట్యప్రదర్శన అందరినీ అలరించింది.

వెల్దుర్తి టౌన్: మహిళలు అన్ని రంగాల్లో ముందుంటేనే సమాజం అభివృద్ధి చెందుతుందని డా. రవీంద్ర, డా. అనుపమ పేర్కొన్నారు. మహిళా వైద్యులను సన్మానించారు. శాంతి, డా. ప్రవళ్లిక నరసింహులు, మోతిబాషా, జనార్దన్ నాయుడు పాల్గొన్నారు.

కప్పట్రాళ్ల మహిళలు దేశానికే ఆదర్శం కావాలి

దేవనకొండ: కప్పట్రాళ్ల మహిళలు దేశానికే ఆదర్శం కావాలని ఈగల్ ఐజీ ఆకె రవికృష్ణ సూచించారు. శనివారం కప్పట్రాళ్ల తానాభవనంలో సేట్రీస్ అధ్వర్యంలో మహిళ దినోత్సవాన్ని నిర్వహించారు. దత్తత పుత్రుడు రవికృష్ణ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. మహిళలు చేతివృత్తులు, వ్యాపారం, వ్యవసాయ రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. అలాగే దేవనకొండ వైద్యశాలలో డీఎంహెచ్‌వో భాస్కర్, తెర్నేకల్‌లో సర్పంచ్ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

మద్దికెర: మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేసినప్పుడే అభివృద్ది సాధ్యమని పత్తికొండ సీఐ పులిశేఖర్‌గౌడ్, విద్యాసాయి కళాశాల ఎండీ వెంకట మాధవ్ అన్నారు. ప్రిన్సిపాల్ బాలసునీత, సర్పంచ్ బండారు సుహాసిని, ప్రభుత్వ వైద్యాధికారి రాగిణి, ఎస్ఐ విజయకుమార్ నాయక్,ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

లోక్ ఆదాలత్‌లో 430 కేసులు పరిష్కారం

ఆదోని, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): లోక్ ఆదాలత్‌లో 430 కేసులు పరిష్కారమయ్యాయని, రెండో అదనపు జిల్లా న్యాయాధికారి సుధా పేర్కొన్నారు. శనివారం కోర్టులో నిర్వహించిన లోక్ ఆదాలత్‌లో 375 క్రిమినల్ కేసులు, 17 ఎంవీవోపీ, 38సివిల్ కేసులు పరిష్కంచామన్నారు. ఒకటి బ్యాంకుకు సంబంధించినది కాగా, మరోకటి ప్రొనోట్ కేసు అని న్యాయధికారి తెలిపారు.

రజకులకు రక్షణ చట్టం తేవాలి


మాట్లాడుతున్న రజక సంఘం అధ్యక్షుడు గురు శేఖర్

ఆదోని అగ్రికల్చర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రజకులకు సామాజిక రక్షణ చట్టం తేవాలని ఈ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గురు శేఖర్ డిమాండ్ చేశారు. శనివారం శాంత మల్లప్ప చెరువు వద్ద రజక సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. రజకులపై దాడులు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. విశ్వకర్మ యోజన పథకానికి ప్రచార ఆర్భాటమే తప్ప నిధులు ఇవ్వడం లేదని ఆరోపించారు. 57 నిండిన రజకులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని, లాండ్రీ షాపుకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించాలని కోరారు వృత్తి పనిముట్లను ఆదరణ పథకం ద్వారా మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ముక్కన్న ఉద్యోగ సంఘం నాయకుడు నాగరాజు, గోవిందప్ప, హుసేని, సిద్ధప్ప, ఈరన్న, మహేష్, చిదానంద, భీమ లింగప్ప, మహేష్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటిని కొలవాల్సిందే


పంచాయతీ సిబ్బందితో డీపీవో, డీఎల్పీవో

ఆదోని రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నివాసముంటే వారికి కొలవాల్సిందేనని డీపీవో భాస్కర్, డీఎల్పీవో నూర్జహాన్ తెలిపారు. శనివారం డివిజన్ పరిధిలోని ఈవోఆర్డీ, పంచాయతీ కార్యదర్శులతో సబ్ కలెక్టర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. మండలంలోని పెసలబండ గ్రామాన్ని పైలెట్ గ్రామంగా తీసుకొన్నామన్నారు. పంచాయతీ సిబ్బంది యుద ప్రాతిపదికన పర్తిచేయాలని సూచించారు. ఎంపీడీవో రాజేంద్ర ప్రసాద్, ఈవోఆర్డీ జనార్ధన్ పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. మహిళలకు గాయాలు

వెల్దుర్తి టౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని నేషనల్ హైవే చెరుకులపాడు క్రాస్ వద్ద ఆటో బోల్తా పడి, ఇద్దరు మహిళలు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన మేరకు.. క్రిష్ణగిరి మండలం ఎర్రగుడికి చెందిన ఇద్దరు మహిళలు, మరికొందరు క్రిష్ణగిరి నుంచి ఎర్రగుడికి ఆటోలో బయలుదేరారు. అయితే చెరుకులపాడు క్రాస్ వద్ద ఆటో బోల్తాపడింది. గాయపడ్డ మహిళలను 108లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సీజనల్ హాస్టల్లో దోపిడీని అరికట్టాలి


మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి రంగప్ప

ఆదోని అగ్రికల్చర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): వలస కార్మికుల పిల్లల కోసం ఏర్పాటు చేసిన సీజనల్ హాస్టల్లో దోపిడీని అరికట్టాలని ఎస్ఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి రంగప్ప, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం యూటీఎఫ్ కార్యాలయంలో విద్యార్థులు లేకున్నా బిల్లులు చేసుకుంటున్నారని ఆరోపించారు. విద్యాశాఖ అధికారులు తనిఖీ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శశిధర్, గౌస్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారిస్తాం



మాట్లాడుతున్న బీజేపీ అసెంబ్లీ కో-కన్వీనర్ నాగరాజు

ఆదోని టౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెడతామని బీజేపీ జిల్లా ఎన్నికల సహాయ కార్యదర్శి చంద్రన్న దేశాయి, ఆదోని అసెంబ్లీ కో-కన్వీనర్ నాగరాజు గౌడ్ అన్నారు. శనివారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ సమస్యలు పరిష్కారమైతేనే పార్టీ క్షేత్రస్థాయిలో బలపడేందుకు అవకాశం ఉందన్నారు. అనంతరం సాదాపురం కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు. సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి చిన్న కోసిగియ్య, బాల మునిశేఖర్, ఉపాధ్యక్షుటు సర్పంచ్ జయరాముడు, మాజీ సర్పంచ్ రాజు, జయలక్ష్మి, ఉలిగప్ప, శేఖర్, నరసింహులు, దేవేంద్ర పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వే పకడ్బందీగా చేయాలి

- జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్

పత్తికొండ టౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వామిత్వ సర్వేను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ ఆదేశించారు. శనివారం స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో పత్తికొండ డివిజన్ స్థాయి ఈవోఆర్‌డీలు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు స్వామిత్వ సర్వేపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. డీపీవో మాట్లాడుతూ గ్రామాల్లో స్వామిత్వ సర్వే చేసేందుకు మెరుగైన సాంకేతికతను ఉపయోగించుకోవాలని సూచించారు. వివిద శాఖల అధికారులు సంయుక్తంగా చేపట్టే ఈ సర్వేలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా సమగ్రంగా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఎల్‌వో వీరభద్రప్ప, ఇన్‌చార్జి ఎంపీడీవో నరసింహులు ఉన్నారు.

కూటమి ప్రభుత్వంపై వైసీపీ పోరాటం

- ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి

కర్నూలు న్యూసిటీ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంపై వైసీపీ పోరాటానికి సిద్దమవు తోందని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి అన్నారు. శనివారం కర్నూలు నగరంలోని ఎస్వీ కాంప్లెక్స్ సమావేశభవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ సమస్యలపై స్పందించడం లేదని, అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం రూ.1.30 లక్షల కోట్లు అప్పు చేసిందన్నారు. సూపర్ సిక్స్ అట్టర్ ఫ్లాప్ అయిందని విమర్శించారు. ఆలూరులో తాగునీరు లేదని, పనులు లేక కూలీలు వలసలు వెళ్తున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేదవతి ప్రాజెక్టు నిర్మిస్తామని చెప్పి బడ్జెట్‌లో రూపాయి కూడ కేటాయించలేదన్నారు. మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌పై ప్రభుత్వానికి స్పష్టత లేదన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్ విజన్ ఉన్న నాయకుడని ఎమ్మెల్యే అన్నారు.

11న మార్కెట్ వేలాలు.

ఆదోని టౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వివిధ మార్కెట్లకు ఈ నెల 11న బహిరంగ వేలాలను నిర్వహించను న్నట్లు మున్సిపల్ కమిషనర్ కృష్ణ శనివా రం తెలిపారు. 2025 ఏప్రిల్ నుంచి 2026 మార్చి 28వరకు మార్కెట్లలో రుసుమును వసూలు చేసేందుకు వేలాలు నిర్వహిస్తు న్నామన్నారు. ఝాన్సీ లక్ష్మీబాయి కూరగా యల మార్కెట్, పశువుల సంత, పశువుల మార్కెట్, గొర్రెల సంత, గొర్రెల మార్కెట్‌కు వేలాలు ఉంటాయన్నారు. నోటిఫికేషన్‌లోని నిబంధనల మేరకు వేలంపాట దారులు పాల్గొనాలని కోరారు.

బాధితులకు ఆర్థిక సాయం


ఆర్థిక సాయం చేస్తున్న నాయకులు

మద్దికెర, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): గ్రామానికి చెందిన రమేష్, మస్తాన్ మృతి చెందడంతో వారి కుటుంబానికి రూ.5వేలు చొప్పున మండల టీడీపీ అధ్యక్షులు శివప్రసాద్ యాదవ్, సుబ్రహ్మణ్యస్వామి ఆలయ సేవా సమితి అధ్యక్షుడు విజయప్రసాద్ యాదవ్ ఆర్థిక సాయం అందజేశారు.

గురుకుల ప్రవేశాల గడువు పెంపు

వెల్దుర్తి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): డా.బి.ఆర్.అంబేద్కర్ గురుకులాల్లో 5వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు మార్చి13వరకు గడువు పెంచినట్లు ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసూన శనివారం తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

స్ప్రింక్లర్లకు నిప్పు


కాలిపోయిన స్ప్రింక్లర్లు

మద్దికెర, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరవలి గ్రామ రైతు నరేంద్రకు చెందిన స్ప్రింక్లర్లను గుర్తు తెలియని వ్యక్తులు కాల్చివేశారు. బాధితుడి కథనం మేరకు.. పొలంలో పనులు ముగియ డంతో స్ప్రింకర్లను ఒక చోట నిల్వ ఉంచారు. అయితే.. శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో అవి కాలిపోయాయి, రూ.లక్ష ఆస్తినష్టం సంభవించిందని, తహసీల్దార్ హుశేనసాహెబ్‌కు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

ఉచిత బస్సు ప్రయాణం పేరుతో మోసం


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఆదోని టౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ఉచిత బస్సు పేరుతో కూటమి ప్రభుత్వం మహిళలను మోసం చేసిందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సాయినాథ్, జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు దిలీప్ ధోకా అన్నారు. శనివారం మహిళా దినోత్సవ సందర్భంగా స్థానిక మహిళల ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవిలతను సన్మానించారు. మాట్లాడుతూ, గత అనేక సంవత్సరాలుగా డివిజన్‌లోని వేలాది మంది మహిళల ఆరోగ్య సమస్యలను పరిష్కరించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ ఉత్తమ వైద్యాధికారిగా పేరు తెచ్చుకొన్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి రావు, దేవిశెట్టి వీరేష్, మండల అధ్యక్షుడు మోహన్ రెడ్డి, శ్రీనిత్, మాణిక్య రాజు, నిసార్ అహ్మద్, తాయన్న, రామన్న యాదవ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

అలూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వినతులు స్వీకరిం చారు. ప్రతి శనివారం వినతులను స్వీకరించి సంబంధిత శాఖలకు పంపిం పరిష్కారం అయ్యేలా చూస్తామన్నారు. ఆలూరు బ్రాంచ్ కెనాల్ అధ్యక్షులు నగరడోణ కిష్టప్ప, కన్వీనర్ అశోక్ యాదవ్, తిమ్మయ్య, నరసప్ప, సురేంద్ర, కొమ్ము రాజు, గుండయ్య, రాము యాదవ్, హనుమప్ప, నాగరాజు, దేవేంద్ర పాల్గొన్నారు.

సారా తయారు చేస్తే పీడీ యాక్టు

తుగ్గలి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): సారా తయారు చేసినా, అమ్మినా పీడీ యాక్టు నమోదు చేసి, గ్రామ బహి ష్కరణ చేస్తామని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ హనుమంత రావు హెచ్చరించారు. శనివారం రోళ్ల పాడు తండా, పగిడిరాయి, జొన్న గిరిలో ప్రజలకు అవగాహన కల్పించారు.

పాడీలా



పశుపోషణకు ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యమిస్తోంది. రూ.కోట్లు నిదులు వెచ్చిస్తోంది. అయితే కొందరు అధికారులు నిర్లక్ష్యంగా పాడి డీలా పడుతోంది. మండలంలోని పల్లెదొడ్డి గ్రామ సచివాయలం వద్ద ఉన్న పశు వైద్యశాలలో పశువులకు టీకాలు వేసే బోను పక్కన పడేశారు. అధికారులు స్పందించి, బోనును దాని స్థానంలో ఉంచాలని పాడిరైతులు, పశు పోషకులు కోరుతున్నారు. - **దేవనకొండ,**

సాగు ప్రశ్నార్థకం..?

- హంద్రీ నీవాకు నీటి సరఫరా నిలిపివేత
- రైతుల ఆందోళన


హంద్రీనీవా కాలువలో తగ్గిన నీరు


కాలువ కింద సాగు చేసిన వరి పైరు

మద్దికెర, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బురుజుల, పెరవలి, బసినేపల్లి, రాంపురం, రాంపురం కొట్టాల, హంపా, బొమ్మనపల్లి, కొత్తపల్లి, ఎడవలి, మద్దికెర గ్రామాల పొలాలకు హంద్రీ నీవా కాలువ నీరే శరణ్యం. ఈ ప్రాంతంలో దాదాపు 5వేల ఎకరాల్లో వేరుశనగ, వరి మినుము, పత్తి, మిరప, తదితర పంటలు సాగు చేస్తున్నారు.

కాలువలో తగ్గిన నీరు

రెండు రోజుల నుంచి శ్రీశైలం నుంచి హంద్రీనీవా కాలువకు అధికారులు నీరు నిలిపివేశారు. దీంతో పంటల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. ప్రతి ఏడాది ఏప్రిల్ ఆఖరు వరకు నీరు సరఫరా చేసేవారు. అయితే ఈ ఏడాది మార్చి 3వ తేదీకే నీటి సరఫరా నిలిపివేడంతో ఏం చేయాలో తెలియక బంద్ చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

మరో 30రోజులు సరఫరా చేస్తే..

కాలువకు మరో 30 రోజులు నీళ్లిస్తే పంటలు చేతికి వస్తాయని అంతవరకైనా నీరు సరఫరా చేసి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి ఏప్రిల్ రెండోవారం ముగిసేవరకు నీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

నీరివ్వకుంటే పంటలు ఎండిపోతాయి



హంద్రీనీవా కాలువ కింద ఐదెకరాల్లో వేరుశనగ సాగు చేశా. పంట ఇంకా కాయదశకు రాలేదు. ఇప్పుడు నీరు నిలిపేస్తే పంటలు ఎండిపోతాయి. - **లింగన్న, రైతు, మద్దికెర**

జాగ్రత్తలతో డీహైడ్రేషన్‌ను తప్పించుకోవచ్చు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ వహీద్



ఆలూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ఎండలు ప్రారంభమవడంతో తగు జాగ్రత్తలు తీసుకుంటే డీ హైడేషన్ నుంచి తప్పించుకోవచ్చని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ వహీద్ సూచించారు.

ప్రశ్న: డీహైడ్రేషన్ అంటే ఏమిటో వివరాస్తారా?

జవాబు: మానవ శరీరంలో అధిక శాతం నీరు ఉంటుంది. వేసవిలో ఎండ వేడికి శరీరంలోని నీటిశాతం పూర్తిగా తగ్గిపోవడాన్ని డీహైడ్రేషేన్ అంటారు.

ప్రశ్న: డీహ్రైడేషన్ గురైతే కనిపించే లక్షణాలు ఏవి?

జవాబు: వడదెబ్బ, తీవ్రజ్వరం, అలసట, స్పృహ కోల్పోవడం, నీళ్ల విరోచనాలు.

ప్రశ్న: వడదెబ్బకు గురైతే ఏం చేయాలి?

జవాబు: వడదెబ్బ తగిలిన వారిని ఎండ నుంచి నీడలోకి తీసుకువచ్చి బాగా గాలి ఆడేలా చూడాలి. ఓఆర్ఎస్ పౌడర్‌ను నీటిలో కలిపి తాగించాలి. పండ్ల రసాలను, మజ్జిగ ఇవ్వాలి. స్పృహ కల్పోతే దగ్గరలోని ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందించాలి..

ప్రశ్న: ఎండ వేడిమి నుంచి తప్పించుకోడానకి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

జవాబు: పనులు ఉంటే ఉదయం, సాయంత్రాల్లో చూసుకోవాలి. ఎండ వేడికి దూరంగా ఉండాలి. తెల్లని దుస్తులు దరించడం, రోజుకు 5 లీటర్లకు తక్కువ కాకుండా నీరు తీసుకోవడం, మజ్జిగ, కొబ్బరినీళ్లతో పాటు తాజాపళ్ల రసాలు తీసుకోవాలి. ముఖ్యంగా చంటి పిల్లలను ఎండలకు బయటకు పంపవద్దు. బయటకు వెళ్లలనుకుంటే గొడుగు లేదా టోపీ పెట్టుకోవాలి.

దళితుల హక్కుల కోసం నిరంతర పోరాటం

● జైభీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చిక్కిం జానయ్య


మాట్లాడుతున్న జైభీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చిక్కిం జానయ్య

మంత్రాలయం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): దళితుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటామని జైభీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చిక్కిం జానయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి గర్జి హనుమన్న అన్నారు. శనివారం మంత్రాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని, దళిత కాలనీల్లో కనీస వసతులు ఏర్పాటు, సబ్‌ప్లాన్ నిధులు, కార్పొరేషన్ నిధులు వెంటనే విడుదల చేయాలని అన్నారు. వచ్చే నెల 14న డా.బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు మంత్రాలయంలో కలిసికట్టుగా నిర్వహిద్దామని నిర్ణయించామన్నారు. సమావేశంలో జైభీమ్ ఎమ్మార్పీఎస్ నాయకులు రత్నం, యోహాన్, అనిల్ కుమార్, మారెప్ప, నాగేంద్ర, గోపాల్, నరసింహులు, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలి


టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీ టిడ్కో గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో టిడ్కో గృహాలను ప్రజాచైతన్య యాత్రలో భాగంగా సమస్యలను అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ కార్యదర్శి పి గోవిందు, రాముడు మాట్లాడుతూ ఎన్టీఆర్ కాలనీలో సుమారు మూడు వేల టిడ్కో గృహాలను ప్రభుత్వం నిర్మించిందన్నారు. లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించడంలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ఒక్కొక్క ఇంటిని ఇద్దరు లబ్ధిదారులకు కేటాయించడం వల్ల గొడవలు వచ్చాయని తెలిపారు. ప్రస్తుతం కరెంటు, తాగునీటి సౌకర్యం, రోడ్లు, డ్రైనేజీ, మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం వల్ల లబ్ధిదారులు విముఖత చూపిస్తున్నారన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం అన్ని రకాల వసతులు కల్పించాలని సీపీఎం డిమాండ్ చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఉస్మాన్, వలి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

కాటికాపర్ల సమస్యలు పరిష్కరించాలి


గోనెగండ్లలో కరపత్రాలను విడుదల చేస్తున్న కాటికాపరుల సంఘం రాష్ట్ర నాయకుడు ఆనంద్‌బాబు

గోనెగండ్ల, మార్చి 8(ఆంధ్రజ్యోతి): శ్మశానాల్లో గుంతలు తీసి మృతదేహాలను పూడ్చే కాటికాపర్ల సమస్యలు అసెంబ్లీలో చర్చించి పరిష్కరించాలని సంఘం రాష్ట్ర నాయకుడు ఆనంద్‌బాబు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రమైన గోనెగండ్లలో కేవీపీఎస్, డప్పుకళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి కరుణాకర్‌తో సంఘం సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే పరిష్కరించి వారిని నాలుగో తరగతి ఉద్యోగులుగా పరిగణించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 11న విజయవాడలో మహాధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు తాయప్ప, మల్లికార్జున, శంకర్, తిమ్మప్ప, ఎర్రబాడు, ఒంటెడుదిన్నె, అగ్రహారం గ్రామాల కాటికాపరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కోసిగి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మూగలదొడ్డి క్రాస్ రోడ్డు వద్ద చిర్తనకల్ గ్రామానికి చెందిన బురుగేని రామాంజనేయులు బైక్‌పై కర్ణాటక మద్యం తరలిస్తుండగా జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ శ్రీదేవి, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్‌బాబు ఆదేశాల మేరకు దాడులు చేసి పట్టుబడినట్లు ఎక్సైజ్ సీఐ భార్గవరెడ్డి, ఎస్ఐ కార్తీక్ సాగర్ తెలిపారు. శనివారం బైక్ సీజ్ చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు. దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, కిషోర్ కుమార్, కానిస్టేబుళ్లు మునిరంగడు, భరత్, రవికుమార్ ఉన్నారు.

నేడు గురు సుబ్బారుడ స్వామి రథోత్సవం


ముస్తాబైన రథం

కోసిగి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బెళగల్ రోడ్డు రంగప్ప కొండ వద్ద వెలసిన శ్రీగురు సుబ్బారుడ స్వామి రథోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు భోంపల్లి మఠం చంద్రయ్య, బొంబాయి దయ తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ శ్రీగురు సుబ్బారుడ స్వామి రథోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారన్నారు. ఉదయం నుంచే ఆలయంలో శ్రీమల్లికార్జున స్వామికి, శ్రీగురు సుబ్బారుడ స్వామికి, శ్రీలక్ష్మమ్మవ్వకు పంచామృతాభిషేకంతో పాటు, ఆకుపూజ, ప్రత్యేక పుష్పాలంకరణ, మహా మంగళహారతులు వంటి పూజలు చేస్తారన్నారు. ఆదివారం సాయంత్రం అశేష భక్తజనవాహిని మధ్య రథోత్సవ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆలయంలో భక్తులకు భోజన సదుపాయం ఏర్పాటు చేశామన్నారు. అనంతరం రాత్రి ఆలయం ముందు భజన కార్యక్రమం ఉంటుందన్నారు రథోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ చంద్రమోహన్ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

'పది' విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం

గోనెగండ్ల, మార్చి 8(ఆంధ్రజ్యోతి): పదవతరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు ఎంఈవో నీలకంఠ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఇందుకు సంబంధించిన జీవో విడుదల అయిందన్నారు. ఈనెల 17 నుంచి 31వరకు పది విద్యార్థులకు ఎలాంటి బస్సుపాస్ లేకపోయినప్పటికి పరీక్ష హాల్‌టికెట్ చూపిస్తే పల్లెవెలుగు, అల్ట్రాపల్లెవెలుగు బస్సుల్లో ప్రయాణించొచ్చన్నారు. గోనెగండ్లలో 650 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నరని, అందుకు గాను గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారని తెలిపారు.


తెలుగు మహిళలతో ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి


కోసిగి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ అయ్యమ్మను సన్మానిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు



గోనెగండ్లలో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్

మహిళా శక్తికి తిరుగులేదు

● ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి
● ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

ఎమ్మిగనూరు, మార్చి8(ఆంధ్రజ్యోతి): మహిళలు ఒక్కసారి అనుకున్నారంటే వారికి శక్తికి తిరుగులేదని, వారు అన్నుకున్నది సాధిస్తారని ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం, కుర్ని కమ్యూనిటీ హాల్‌లో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణం, ఆయా మండలాలకు చెందిన మహిళా అధికారులు, పట్టణ పారిశుధ్య సిబ్బందితో పాటు వివిధ రంగాల్లో రాణిస్తున్న పలువురు మహిళలను, టీడీపీ మహిళా విభాగం నాయకురాళ్లను ఎమ్మెల్యే శాలువతో ఘనంగా సన్మానించి చీరలను అందజేశారు. ఈ సందర్భంగా మహిళా మణులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన ఇన్ చార్జీ రేఖా గౌడ్, డీఈ నీరజ, కౌన్సిలర్లు సరోజ, ఏఎస్ఐ రుక్మిణి, టీడీపీ మహిళా విభాగం నాయకురాళ్లు దేవమ్మ, కాశీం బీ, చంద్రమ్మ, పార్వతి, ఉమాలు పాల్గొన్నారు.

మహిళలను గౌరవించాలి: ఎమ్మెల్యే

నందవరం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మహిళలను ప్రతి ఒక్కరు గౌరవించాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. శనివారం పూలచింత సర్పంచ్ అక్కామాంబదేవిని మహిళా దినోత్సవ సందర్భంగా బీవీ సన్మానించారు. మహిళా దినోత్సవ ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో పూలచింత బండేగురుస్వామి పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళలను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం ఏపీ మహిళా సమాఖ్య పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఈరమ్మ, వాణి, నాగశిరోమణి మాట్లాడుతూ దశాబ్ద కాలం మహిళలు సాధించిన విజయాలు, హక్కులు, సమానత్వం, సాధికారత లక్ష్యంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. మహిళలకు అవకాశాలు కల్పిస్తే పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తామన్నారు. సమావేశంలో ఎస్టీయూ నాయకులు ప్రసన్నరాజు, సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, సరిత, పరిమళ, లక్ష్మీ, నాగవేణి, రేణుక, మాబి, మైబూన్, హసీనా పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

మంత్రాలయం: మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందని టీడీపీ నియోజకవర్గ నాయకులు రామకృష్ణా రెడ్డి, రఘునాథరెడ్డి అన్నారు. శనివారం మంత్రాలయం మండలంలోని మాధవరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి మహిళలకు శాలువ, పూలమాలతో ఘనంగా సన్మానించారు. కూటమి ప్రభుత్వం మహిళలకు ఈ ఏడాది వార్షిక బడ్జెట్‌లో ఎన్నడూ లేనివిధంగా రూ.4,332 కోట్లు కేటాయించిందన్నారు. కూటమి ప్రభుత్వానికి మహిళలు అండగా ఉండాలని కోరారు. మహిళలు డ్వాక్రా రుణాలతో జీవననైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. సమావేశంలో టీడీపీ పెద్దకడుబూరు మండల అధ్యక్షుడు బసలదొడ్డి ఈరన్న, టీడీపీ మహిళా నాయకురాళ్లు ఈరమ్మ, నాగమ్మ, శారదమ్మ, లక్ష్మీ పాల్గొన్నారు.

● మహిళల సంక్షేమానికి ఆర్డీటీ విశేషంగా కృషి చేస్తుందని ఆర్డీటీ ఏరియా కోఆర్డినేటర్ కృష్ణయ్య, సీతఈవో నరసింహులు అన్నారు. శనివారం పరమాన్‌దొడ్డి తండాలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. అదే విధంగా బీజేపీ ఆధ్వర్యంలో మహిళలను సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, నాయకులు పురుషోత్తంరెడ్డి, అంగన్‌వాడీ టీచర్ లింగమ్మ, గ్రామ కార్యదర్శి స్వామినాథన్ పాల్గొన్నారు.

కౌతాళం: మండలంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కౌతాళంలోని పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ పాల్‌దినకరన్ ఆధ్వర్యంలో అంగనవాడీ కార్యకర్తలతో కలిసి కేక్‌ను కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అలాగే ప్రతిభ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు జ్ఞానేశ్వరి ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అంతకు ముందు మదర్‌థెరిస్సా, ఝాన్సీలక్ష్మీబాయి, ఇందిరాగాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ దూద్‌బాష, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు టౌన్: పట్టణంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఐఎఫ్‌టీయూ, పీవోడబ్ల్యూ, ఎస్టీయూ, సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయాల్లో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ మహిళా సాధికారిత సాధ్యమైనప్పుడే దేశాభివృద్ధి సాకారమవుతుందని, అన్ని రంగాల్లో మహిళలు ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు వెంకటేశ్, సువర్ణలత, లక్ష్మీ, సోమేశ్వరి, శ్యామల తదితరుల పాల్గొన్నారు.

కోసిగి: నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కోసిగి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ కుమారి అయ్యమ్మ అన్నారు. శనివారం కోసిగి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అయ్యమ్మ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. అలాగే మోడల్ స్కూల్‌లో నిర్వహించిన వేడుకల్లో ఏఎస్ఐలు తిరుపాల్ నాయక్, నాగరాజు విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో అంగన్‌వాడీ టీచర్లు లూసమ్మ, దేవి, పద్మమ్మ, మణి, నాగవేణి, సుజాత పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

గోనెగండ్ల, మార్చి 8(ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళలు ఆర్థిక రంగంతో పాటు అన్ని రంగాలలో పురోగతి సాధించిననాడే దేశాభివృద్ధి సాధ్యమని జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండలపరిధిలోని పలు గ్రామాలలో సమావేశాలు నిర్వహించారు. అందులో భాగంగా గోనెగండ్లలోని పంచాయతీ కార్యాలయం ఆవరణంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ముఖ్య అతిథులుగా డీపీవో భాస్కర్, డీఎల్‌పీవో నూర్జహన్, సీఐ గంగాధర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు తమ హక్కుల కోసం పోరాడి చట్ట సభల్లో సమాన హక్కులు సాధించుకున్నారన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న హక్కులను సక్రమంగా వినియోగించుకొని మహిళలు అన్ని రంగాలలో ముందుకు రావాలని కోరారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. పలు శాఖలలో పని చేస్తున్న మహిళలకు పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ అనంతశయన, సర్పంచులు హైమావతి, లింగమ్మ, సోమన్న, పంచాయతీ కార్యదర్శులు సతీష్, వెంకటేశ్, పాల్గొన్నారు.


మంత్రాలయం మండలం మాధవరంలో మహిళలకు కేక్‌ను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు


ఎమ్మిగనూరు సీపీఐ కార్యాలయంలో మహిళలను సన్మానిస్తున్న దృశ్యం



ఎమ్మిగనూరుటౌన్: జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానించిన ఎస్టీయూ

బీజేపీని బలోపేతం చేస్తాం

- పురుషోత్తంరెడ్డి


బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, రాష్ట్ర నాయకులు పురుషోత్తంరెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న నాయకులు, కార్యకర్తలు

మంత్రాలయం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, హైకోర్టు సీనియర్ అడ్వకేట్ పురుషోత్తంరెడ్డి, జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ అన్నారు. శనివారం మంత్రాలయంలోని ప్రైవేటు అతిథి గృహంలో బీజేపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, సీనియర్ న్యాయవాది పురుషోత్తం రెడ్డి హాజరై మాట్లాడారు. కార్యకర్తలు సమస్యలు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. నియోజకవర్గంలో గత ఐదేళ్లలో వైసీపీ సర్వనాశనం చేసిందని, టీడీపీ, బీజేపీ కార్యకర్తలపై కేసులు బనాయించి ఇబ్బందులకు గురి చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నేతలు బీజేపీ నాయకులను, కార్యకర్తలను విస్మరించడం సరికాదన్నారు. అనంతరం పురుషోత్తం రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు రామకృష్ణకు గజమాలు, రాఘవేంద్రస్వామి మెమెంటో ఇచ్చి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కౌతాళం, కోసిగి మండల అధ్యక్షుడు వెంకన్న, రాముడు, బదినేహాల్ రమేష్, ప్రభాకర్, శివరామ్‌గౌడు, రాగన్న, రామాంజి, ఈరమ్మ, నరసన్న, ఎంపీటీసీ అయ్యమ్మ, రాగన్న తదితరులు పాల్గొన్నారు.

వెండి గజ వాహనంపై ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు వెండి గజవాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. నవమి శుభదినం సందర్భంగా మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి, మంచాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వాయిద్యాల మధ్య వెండి గజవాహనంపై స్వర్ణ అంబారిలో వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను అధిష్టించి పీఠాధిపతి మహామంగళహారతితో ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం స్వామి వారికి ఊంజలసేవ నిర్వహించారు.


రజత గజవాహనంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయానికి పోటెత్తిన భక్తులు

రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో సందడి గా మారింది. రెండవ శనివారం, ఆదివారం సెలవు దినం కావటంతో వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, తుంగభద్ర నది తీరం భక్తులతో కోలాహలంగా మారింది. తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరించి గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. రథోత్సవాల ఊరేగింపులో పాల్గొని భక్తులు మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆశీస్సులు పొందారు.


భక్తులతో రద్దీగా ఉన్న శ్రీమఠం ప్రాంగణం

రాఘవేంద్రుడి సన్నిధిలో కర్ణాటక న్యాయాధికారి

రాఘవేంద్ర స్వామిని కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ జీఎం ఉమాదేవి శనివారం దర్శించుకున్నారు. మహాముఖ ద్వారం వద్ద ఆమెకు ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషి, సురేష్ కోణాపూర్, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహామూర్తి స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. ఈమె వెంట మంత్రాలయం సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్, అనంతపురాణిక్, అనంతస్వామి ప్రకాశ్ ఆచార్, పవన్ ఆచార్, వ్యాసరాజార్, జయతీర్థ ఆచార్, జేపీ స్వామి, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.


స్వామివారికి ఫల, పుష్పాలు తీసుకొస్తున్న న్యాయాధికారి

వాయు పుత్రుడికి ప్రత్యేక పూజలు

కౌతాళం మార్చి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ ఆంజనేయస్వామి దేవాలయాల్లో శనివారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. బుడుములదొడ్డి, ఎరిగేరి పులిగట్టు, అగసలదిన్నె అంజనేయస్వామి దేవాలయాల్లో అర్చకులు తెల్లవారుజామునే మూలవిరాట్‌ను అలంకరించారు. స్వామి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఆకుపూజకు చేశారు. భక్తులకు ఆలయాల్లో అన్నదానం చేశారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి: ఎమ్మెల్యే


ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న మైనార్టీ నాయకులు

ఎమ్మిగనూరు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో నియోజకవర్గంలోని ఆయా మండలాల్లోని గ్రామాలకు చెందిన ప్రజలు సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు. పట్టణానికి చెందిన పలువురు ముస్లిం మైనార్టీ నాయకులు హాజీ బడేసాబ్, కేఎండీ ఫారుక్, షాబీర్, ముల్లా కలీముల్లా, తురేగల్ నజీర్, నవాజ్, మాబులు ముస్లీంల పవిత్ర స్థలాలైన దర్గాలు ఉన్న ప్రాంతాలైన ఎల్లార్తి, కౌతాళ లకు ఆర్టీసీ బస్సులు నడపాలని కోరారు. అలాగే ఎమ్మిగనూరు మండలం చెన్నాపురం గ్రామాన్ని ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని గ్రామస్థులు ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చారు. అలాగే ఎమ్మిగనూరు నుంచి కౌతాళం కు బస్సుసర్వీసును పునరుద్ధరించాలని జిలాన్ ఎల్లార్తి దర్గా తరుపున వినతిపత్రం ఇచ్చారు. అలాగే నాగలదిన్నె, గోనెగండ్ల, పార్లపల్లి, గంగవరంతో పాటు పట్టణానికి చెందిన పలువురు తమ సమస్యలపై వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తనకు వచ్చిన వినతిపత్రాలను ఆయా శాఖలకు పంపుతున్నామని వాటిని పరిశీలించి పరిష్కరిస్తారని తెలిపారు.


ఈద్గా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

● పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు రోడ్డులోని 32వ వార్డులో ఉన్న ఈద్గా స్థలాన్ని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి శనివారం పరిశీలించారు. ఈద్గాలో ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలు ఏవైనా ఉన్నాయా లేదా అనే విషయాలను తెలుసుకున్నారు. ఈద్గా మసీదు అభివృద్ధికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు హాజీ బడేసాహెబ్, మాజీ కౌన్సిలర్ ఖరీముల్లా, షాబీర్, ఫారుక్, అమాన్, బందెనవాజ్, ఫారుక్, అమాన్, ఇసాక్ పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం


అగ్నికి ఆహుతైన గడ్డివామి

పెద్దకడుబూరు, మార్చి8(ఆంధ్రజ్యోతి): పెద్దకడుబూరు మండలంలోని దొడ్డిమేకల గ్రామంలో గడ్డివామి దగ్ధమైంది. ఈ ఘటన శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు మల్లేష్ ఐదుఎకరాల వరిగడ్డిని కొనుగోలు చేసి వాము వేశాడు. అయితే ప్రమాదవశాత్తు గడ్డివామికి నిప్పంటుకొని మంటలు చెలరేగాయి. దీంతో గడ్డివామి పూర్తిగా కాలిబూడిదైంది. దీంతో రైతు మల్లేష్‌కు రూ.లక్షల నష్టం జరిగిందని రైతు వాపోయాడు. రైతును ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.